నవతెలంగాణ

నవ్య తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

గురువారం | నవంబర్ 07, 2024 | www.navatelangana.com

మున్నూరు కాపు మిత్ర మండలి కన్వెన్షన్ హాల్ ప్రారంభం

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

జిల్లా కేంద్రంలోని భవానీనగర్(సోఫీనగర్)లో నూతనంగా ఏర్పాటు చేసిన మున్నూరు కాపు మిత్ర మండలి కన్వెన్షన్ హాల్ ప్రారంభోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్, నిర్మల్ మున్నూరు కాపు మిత్ర మండలి గౌరవ అధ్యక్షులు గండ్రత్ ఈశ్వర్ హాజరయ్యారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో పలువురు సంఘ సభ్యులు పాల్గొన్నారు.



రాబోయే తరానికి ప్లాస్టిక్ అంటే తెలియకుండా చేయాలి

బోథ్ : రాబోయేతరానికి ప్లాస్టిక్ అంటే తెలియకుండా చేయాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని కుచులాపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇందిరా మహిళ శక్తి విజయ స్టీల్ బ్యాంకును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మహిళలతో కలిసి ప్లాస్టిక్ నిర్మూలన కోసం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం తగ్గించాలంటే మహిళల ప్రచారమే ఎక్కువ అవసరమన్నారు. మహిళలు తలచుకుంటే ప్లాస్టిక్ నిర్మూలన సాధ్యమేనని అన్నారు. మొదటి స్టీల్ బ్యాంకు ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మాజీ సర్పంచ్‌లు సురేందర్ యాదవ్, శ్రీధర్‌రెడ్డి, నాయకులు నారాయణరెడ్డి, ఎలక రాజు, ఎంపిటి జీవన్‌రెడ్డి, ఏపీఎం మాధవ్, పాల్గొన్నారు.



సమగ్ర కుటుంబ సర్వే సందడి..!

- పల్లె, పట్టణాల్లో సందడి వాతావరణం
- మూడు రోజుల పాటు స్టిక్కర్లు అతికించే ప్రక్రియ
- అనంతరం ఇంటింటి సమగ్ర వివరాల సేకరణ
- క్షేత్రస్థాయి పర్యటనలో అధికారులు

పల్లె, పట్టణాల్లో ఇంటింటి సర్వే సందడి ప్రారంభమైంది. ఇప్పటికే కొన్ని చోట్ల స్టిక్కర్లు అతికించగా.. మెజార్టీ ప్రాంతాల్లో తాజాగా ఇంటింటికి స్టిక్కర్లు అతికించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. బుధవారం నుంచి ఈ నెల 8వ తేదీ వరకు మూడు రోజుల పాటు స్టిక్కర్లు అతికించి.. ఆ తర్వాత వాటి ఆధారంగా ఇంటింటి నుంచి సమగ్ర వివరాలు సేకరించనున్నారు. ఇప్పటికే అధికార యంత్రాంగం సర్వే చేపట్టనున్న సిబ్బందికి శిక్షణ పూర్తిచేయగా.. గ్రామాలు, పట్టణాల్లో ఇండ్ల జాబితాకు అనుగుణంగా అవసరమైన ఎన్యూమరేటర్లను నియమించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వీరందరూ ఆయా పల్లెలు, వార్డులకు వెళ్లి స్టిక్కర్లు అతికించే క్రతువును చేపట్టగా.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సందడి వాతావరణం నెలకొంది. ఉన్నతాధికారులు ఆయా చోట్లకు స్వయంగా వెళ్లి పర్యవేక్షణ చేపడుతున్నారు. కాగా ఆదిలాబాద్ జిల్లాలో విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులు, సిబ్బందికి షోకాజ్ నోటీసు జారీ చేయడం సర్వే ప్రాధాన్యతను తెలియజేస్తోంది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల పూర్తి స్థితిగతులు తెలుసుకునేందుకు సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని భావిస్తోంది. ఇందులో కులాల వారీగా లెక్కలు స్పష్టంగా తెలియడంతో పాటు ప్రజలకు సంబంధించి సమస్త స్వరూపం వెల్లడయ్యేందుకు ఆస్కారం లభిస్తుంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ సర్వేను అత్యంత పకడ్బందీగా చేపట్టాలని నిర్ణయించింది. ఇప్పటికే జిల్లా స్థాయిలో సర్వే నిర్వహించే సిబ్బందికి శిక్షణలు పూర్తిచేసిన అధికార యంత్రాంగం వారిని పూర్తిస్థాయి సర్వేకు సన్నద్ధం చేస్తోంది. తాజాగా ఆయా గ్రామాలు, వార్డులకు కేటాయించిన ఎన్యూమరేటర్లు క్షేత్రస్థాయికి వెళ్లి ఇండ్లకు స్టిక్కర్లు అతికించే ప్రక్రియ చేపట్టారు. గ్రామాల్లో ఎస్జీటీ ఉపాధ్యాయులతో పాటు పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీలు, ఫీల్డ్ అసిస్టెంట్లకు సర్వే బాధ్యతలు అప్పగించగా.. పట్టణాల్లో ఎస్జీటీ ఉపాధ్యాయులతో పాటు మెప్మా రిసోర్స్‌పర్సన్లు, అంగన్‌వాడీలు, స్వయం సహాయక సభ్యులకు ఎన్యూమరేటర్లుగా విధులు అప్పగించారు. సర్వేను నిశితంగా పరిశీలించేందుకు పర్యవేక్షకులను సైతం నియమించారు. తొలి రోజున ఇంటింటికి స్టిక్కర్లు అతికించారు. వాటిపై ఇంటి యజమాని పేరు, వార్డు, ఇంటి నెంబర్ నమోదు చేసి సీరియల్ నెంబర్ వేసి ఎక్సెల్‌సీట్‌లో నమోదు చేస్తున్నారు. వీటి ఆధారంగా ఎన్యూమరేటర్లకు కేటాయించే ఇండ్లు, కుటుంబాలు స్పష్టంగా తెలిసేందుకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

75ప్రశ్నలకు వివరాలు సేకరణ

ప్రభుత్వం ఈ సర్వేను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో పాటు ప్రజల నుంచి సమగ్ర సమాచారం సేకరించాలని భావించింది. ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటికే 1.97లక్షల కుటుంబాలను గుర్తించిన అధికారులు 2012 ఎన్యూమరేషన్ బ్లాక్‌లను గుర్తించారు. సర్వే కోసం 1997 ఎన్యూమరేటర్లు, 214 మంది సూపర్‌వైజర్లను నియమించారు. సర్వే కోసం 75 అంశాలతో కూడిన ప్రశ్నావళిని రూపొందించింది. వీటన్నింటికీ ఇంటి యజమాని నుంచి వివరాలు సేకరించి బుక్‌లెట్‌లో నమోదు చేయనున్నారు. ఎన్యూమరేటర్ సర్వేకు వచ్చిన సమయంలో ఇంటి యజమాని లేదంటే వివరాలు తెలిసిన వారు ఒక్కరు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఇంటి వివరాలతో పాటు ఆధార్, ఫోన్ నెంబర్, ధరణి పాస్‌బుక్, రేషన్‌కార్డుతో పాటు ఆర్‌ఓఎఫ్‌ఆర్ పాస్‌బుక్ తదితర వాటిని దగ్గర ఉంచుకోవాలని చెబుతున్నారు. మూడు రోజుల పాటు ఇండ్లకు స్టిక్కర్లు అతికించిన తర్వాత బుక్‌లెట్‌లో సమగ్ర వివరాలు నమోదు చేయనున్నారు. మరోపక్క సర్వేకు సంబంధించి ప్రశ్నావళితో పాటు బుక్‌లెట్లు ఇంకా జిల్లాకు చేరుకోలేదని తెలిసింది. ప్రశ్నావళిలోనూ కొన్ని మార్పులు ఉండే అవకాశం ఉందని సమాచారం. దీంతో పాటు సర్వే పూర్తయిన తర్వాత మరో సుమారు వారం నుంచి పది రోజుల పాటు వీటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి.

ఇంటింటి సర్వేకు అందరూ సహకరించాలి

- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్, మామడ మండలం న్యూసాంగ్వీలో పరిశీలన



నవతెలంగాణ-నిర్మల్

ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉపాధి, కుల వివరాల సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జరిపిస్తున్న ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలు తమవంతు సహకారం అందించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ కోరారు. సర్వే కోసం ఇళ్లకు వచ్చే ఎన్యూమరేటర్లకు వాస్తవ వివరాలతో కూడిన సమాచారాన్ని అందించాలని సూచించారు. మామడ మండలం న్యూసాంగ్వీలో ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహిస్తున్న తీరును కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా ఇళ్లను సందర్శించి కుటుంబ సర్వే నిర్వహణ కోసం అతికించిన స్టిక్కర్లను చూసి, వాటిపై నమోదు చేసిన ఇంటి నెంబరు, ఎన్యూమరేషన్ బ్లాక్, క్రమ సంఖ్య ఇతర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పకడ్బందీగా సర్వే జరపాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇంటింటి సర్వే కోసం ఏ ఒక్క నివాస గృహాన్ని సైతం మినహాయించకుండా ఎన్యూమరేషన్ బ్లాక్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలలోని రికార్డుల ఆధారంగా ఎన్యూమరేషన్ బ్లాక్‌లను గుర్తించామన్నారు. ఒక్కో బ్లాక్‌కు ఒకరు చొప్పున ఎన్యూమరేటర్లను నియమించామని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సర్వే నిర్వహించాల్సిన తీరుపై వారికి శిక్షణ తరగతుల ద్వారా స్పష్టమైన అవగాహన కల్పించామని కలెక్టర్ తెలిపారు.

గర్భస్థ మహిళల మరణాలు తగ్గించేందుకు చర్యలు చేపట్టాలి

గర్భస్త మహిళల మరణాలు తగ్గించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో గర్భస్థ మరణాలపై వైద్యశాఖ అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గర్భం దాల్చిన వెంటనే మహిళలకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి, హైరిస్క్ గర్భిణులను గుర్తించాలన్నారు. అవసరమైన మందులను అందించాలని తెలిపారు. హైరిస్క్ గర్భిణులపై నిరంతర పర్యవేక్షణ ఉంచి, అవసరమైన వైద్య చికిత్సలు అందించాలని సూచించారు. ఇప్పటివరకు జిల్లాలో నమోదైన గర్భస్థ మహిళల మరణాల గురించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రాజేందర్, వైద్యాధికారులు శ్రీనివాస్, సురేష్, సౌమ్య, సరోజ, నయనరెడ్డి పాల్గొన్నారు.

గ్రూప్-3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

గ్రూప్-3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లాలో నిర్వహించనున్న గ్రూప్-3 పరీక్షల నిర్వహణపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి ఆమె సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ నెల 17,18 తేదీలలో నిర్వహించనున్న గ్రూప్-3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. పరీక్ష నిర్వహణకు జిల్లా కేంద్రంలో 24 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 8,124 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. అభ్యర్థులకు ఏవైనా ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తితే ప్రాథమిక చికిత్స అందించడానికి వీలుగా పరీక్ష కేంద్రాలలో వైద్య సిబ్బందిని, మందులను అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. సమావేశంలో పరీక్షల ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి గంగారెడ్డి, డిఎంహెచ్‌ఓ రాజేందర్, మున్సిపల్ కమిషనర్ అహ్మద్ ఖమర్, ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి పాల్గొన్నారు.

కుటుంబ సర్వేకు సహకరించాలి : ఎమ్మెల్యే బొజ్జు

నవతెలంగాణ-ఉట్నూర్

సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండలంలోని బోయవాడ కాలనీలో సర్వే ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నమోదు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న జనగణన, కుటుంబ సర్వేలకు ప్రజలు సహకరించి వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం బీర్సాయిపేట్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ కేంద్రాల్లోనే వరి ధాన్యాన్ని అమ్ముకొని మద్దతు ధర పొందాలని తెలిపారు.

ఖానాపూర్ : పట్టణంలోని 11వ వార్డు రాజీవ్‌నగర్‌లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను బుధవారం మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం ప్రారంభించారు. సర్వే కార్యక్రమానికి ఇంటికి వస్తున్న అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్, నోడల్ అధికారి పరుశురాం పాల్గొన్నారు.

సిరికొండ : ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించాలని మండల ప్రత్యేక అధికారి, డిఎల్పిఓ ఫణీందర్‌రావ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ఇంటింట సర్వేలో భాగంగా ఇళ్లకు పోస్టర్లను అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు స్వచ్ఛందంగా పూర్తి సమాచారాన్ని ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ తుకారాం, ఎంపిఓ సంతోష్, డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

తలమడుగు : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే బుధవారం మండల వ్యాప్తంగా ప్రారంభమైంది. దీన్ని మండల ప్రత్యేక అధికారి గజానన్ ప్రారంభించారు. అనంతరం సుంకిడి గ్రామంలో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి గజానన్ మాట్లాడుతూ ఇంటికి వచ్చిన అధికారులకు కుటుంబ సభ్యుల వివరాలను పూర్తిగా తెలిపి సహకరించాలని ప్రజలను కోరారు. ప్రత్యేక అధికారి వెంట ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈవో వెంకట్‌రావు, పంచాయతీ కార్యదర్శి గజానన్, కృష్ణచైతన్య ఉన్నారు.



ఆయిల్ ఫామ్ సాగుకు ముందుకు రావాలి



నవతెలంగాణ-కడెం

తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి నిచ్చే ఆయిల్ ఫామ్ సాగుకు రైతులు ముందుకు రావాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండలంలోని రైతువేదికలో ద్యాన, పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆయిల్ ఫామ్ సాగు అవగాహన సదస్సుకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఆయిల్ ఫామ్ పంట సాగు చేసిన రైతులకు అధిక మొత్తంలో సబ్సిడీ రాయితీ లభించనుందని తెలిపారు. అధికారులు ఆయిల్ ఫామ్ పంట సాగు చేస్తే కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం, కాంగ్రెస్ మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పొద్దుటూరి సతీష్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు తారి శంకర్, సింగిల్ విండో డైరెక్టర్‌లు గొల్ల వెంకటేష్, పడిగెల భూషణ్, మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పిటిసి తక్కల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు వాజిద్‌ఖాన్, నచ్చన్‌ఎల్లాపూర్ మాజీ సర్పంచ్ బొడ్డు గంగన్న, ఎలగడప మాజీ సర్పంచ్ భూమేశ్వర్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందజేత

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని బోరిగాం గ్రామంలో నిర్మల్ ఆర్టీసీ ఆధ్వర్యంలో అర్హులైన 31మంది దివ్యాంగులకు ప్రయాణంలో 50శాతం రాయితీతో బస్ పాసులను అందజేశారు. ఈ పాస్‌లు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులలో ఆఫ్ టికెట్‌పై ప్రయాణం చేయవచ్చని బస్ పాస్ అధికారి టివి.రమణ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో నిర్మల్ స్టేషన్ మేనేజర్ ఏఆర్.రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ నారాయణ, విడిసి సభ్యులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఖానాపూర్

పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సిఎం సహాయనిధి చెక్కులను బుధవారం లబ్దిదారులకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను అన్ని విధాల ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం, వైస్ చైర్మన్ కావలి సంతోష్, మండల అధ్యక్షులు దొనికేని దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, కౌన్సిలర్ కిషోర్ నాయక్, నాయకులు జన్నారపు శంకర్, అమానుల్లాఖాన్, షబ్బీర్ పాషా, తోట సత్యం పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓను సన్మానించిన నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డీఎంహెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరించిన నరేందర్ రాథోడ్‌ను జిల్లాకు చెందిన పలువురు ఆదివాసీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరిగి జిల్లాలోనే బాధ్యతలు తీసుకోవడం మంచి పరిణామమని తెలిపారు. ఆదివాసులకు సేవలను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా చైర్మెన్ సెడ్మకి ఆనందరావు, నాయకులు శేషరావు, భీంరావు, కుంరం ఉద్ధవ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సరుకులు అందజేత

నవతెలంగాణ-ఖానాపూర్

రెండు సంవత్సరాల క్రితం జరిగిన వినాయక నిమజ్జనలో ప్రమాదవశాత్తు కాలు కోల్పోయిన బాధిత కుటుంబానికి ఖానాపూర్ వాసి, ఓకేఆర్ బృందం సభ్యులు నిత్యావసర సరుకులు అందజేశారు. పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన సుర రాకేష్‌కు ఓకేఆర్ ఫౌండర్ కృష్ణంరాజు కృత్రిమ కాలు త్వరలో అందజేయనున్నట్లు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు దూడం శ్రీనివాస్, నంది రామన్న, పంబల భీమన్న, సంగర్తి రాజన్న, మడిగేల అనిల్, సిరిగిరి లక్ష్మణ్ పాల్గొన్నారు.

నీటిని వథా చేయొద్దు

నవతెలంగాణ-నార్నూర్

నీటిని వథా చేయకుండా సక్రమంగా వినియోగించుకోవాలని మండల ప్రత్యేక అధికారి గంగాధర్, ఆర్‌డబ్ల్యుఎస్ డిఈ శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో నీతి ఆయోగ్‌లో భాగంగా జల్ ఉత్సవ్ కార్యక్రమాన్ని అన్ని శాఖల ఆధ్వర్యంలో నిర్వహించారు. నీటి వాడకంపై పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజలింగం, సీడీపీఓ శారద, ఎంపిఓ స్వప్నషీలా, ఏపిఓ జాదవ్ సురేష్, సూపరింటెండెంట్ గంగాసింగ్, నీతి ఆయోగ్ కో ఆర్డినేటర్ రాహుల్ పాల్గొన్నారు.

సొనాలలో బాలానందం వర్ధంతి

బోథ్: మండలంలోని సొనాల గ్రామంలో బుధవారం మాల సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ భవనంలో బాలానందం వర్ధంతిని నిర్వహించారు. మాల సంఘం మండల సెక్రటరీ మెరుగు ప్రభాకర్ మాట్లాడుతూ మాలల అభ్యున్నతికి నిరంతరం పోరాటం చేసిన మహాయోధుడని తెలిపారు. ఈసీఐఎల్‌లో ఉద్యోగం వదిలేసి దళితుల కోసం, మాల జాతి కోసం ఎనలేని సేవలు చేశారన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మద్దెల మహేష్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కార్తీక మాసంలో ప్రత్యేక బస్సుల సౌకర్యం

నిర్మల్‌టౌన్: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని కాళేశ్వరానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి తెలిపారు. ఈ నెల 11న ఉదయం 5గంటలకు నిర్మల్ బస్టాండ్ నుండి బయలుదేరి కాళేశ్వరం ఉదయం 10.15గంటలకు చేరుకుంటుందని, తిరిగి మధ్యాన్నం 1.30కు బయలుదేరి సాయంత్రం 7గంటలకు నిర్మల్ చేరుకుంటుందని తెలిపారు. నిర్మల్ నుండి అప్ అండ్ డౌన్ ఛార్జి రూ.1200, ఖానాపూర్ నుండి రూ.1100 ఉంటుందన్నారు. ప్రయాణికులు ముందుగా టికెట్ బుక్ చేసుకోవాలని తెలిపారు. ప్రతి శని, ఆది, సోమవారాలు వేములవాడకు కూడా బస్సు నడుపుతున్నామన్నారు. పెద్దలకు రూ.260, పిల్లలకు రూ.140 చార్జి ఉంటుందన్నారు. నిర్మల్ పట్టణ, పరిసర శివ భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని ఆమె కోరారు.

మెయిన్ అంగన్వాడీలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్
- ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్రంలో మినీ నుండి మెయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా మారిన 4వేల మందికి 5నెలల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. బుధవారం ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెల్పర్స్‌ను నియమించడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మొత్తం ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అనేక పోరాటాల ఫలితంగా 4వేల మంది మినీ అంగన్వాడీ టీచర్లను 2024 జనవరి నుండి మెయిన్ అంగన్వాడీ టీచర్స్‌గా గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన విధానం వల్ల వీరికి నిరాశే మిగిలిందన్నారు. 5 నెలల వేతనాలు పాత పద్ధతిలో సగం వేతనాలే చెల్లించారన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని అనేకసార్లు అధికారులకు, ఐసీడీఎస్ మంత్రికి వినతి పత్రాలు ఇచ్చినా నేటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. 4వేల మందిని మెయిన్ టీచర్స్‌గా గుర్తించినట్లు అప్డేట్ కాలేదని అధికారులు చెప్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ, కళావతి, సుజాత, యమున పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆరు నెలల పెండింగ్ డీఏ, డీఆర్‌లను వెంటనే ప్రకటించి అమలు చేయాలని పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ సంఘం జిల్లా అధ్యక్షుడు శశికాంత్ డిమాండ్ చేశారు. బుధవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల ఏరియర్స్ బిల్లులను (గ్రాట్యుటీ, కమ్యుటేషన్, పీఆర్సీ ఏరియర్స్, లీవు ఎన్‌క్యాష్‌మెంట్, జీపిఎఫ్ ఫైనల్ పేమెంట్స్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ తదితర బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. కమ్యుటేషన్ వాల్యూ ఆఫ్ పెన్షన్ సివిపిని 15 సంవత్సరాలు కాకుండా 12సంవత్సరాలకే రిస్టోర్ చేయాలని తెలిపారు. కోర్టుకు పోయిన వారికే కాకుండా జనరలైజ్ చేసి కోర్టుకు పోనివారికి కూడా వర్తింపజేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈహెచ్‌ఎస్ కింద హెల్త్ కార్డులపై గరిష్ఠ పరిమితిలేని నగదు రహిత వైద్య చికిత్సలను అన్ని కార్పొరేట్ వైద్యశాలల్లో నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. అర్హత కలిగిన ఈపీఎస్ పెన్షనర్లకు ఆసరా పెన్షన్లు, తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలని అన్నారు. ప్రతి జిల్లాలో వెల్నెస్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కేంద్రాలలో సుశిక్షితులైన డాక్టర్లను, తగిన సిబ్బందిని నియమించి అన్ని రకాలైన ఔట్ పేషెంట్ జబ్బులను గుర్తించి ఉచిత టెస్టులు చేసి ఉచిత మందులు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, కార్యదర్శి జగన్‌మోహన్, పలువురు పెన్షనర్లు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమంపై ప్రభుత్వం మరింత దృష్టి సారించాలి

- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



నవతెలంగాణ-భైంసా

మత్స్యకారుల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం మరింత దృష్టి సారించాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. బుధవారం గడ్డెన్న వాగు ప్రాజెక్టులో మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేప పిల్లల వదిలే కార్యక్రమాన్ని చేపట్టిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సంవత్సరం 13లక్షల20వేల చేప పిల్లలను ప్రభుత్వం వంద శాతం రాయితీతో పంపిణీ చేస్తుందన్నారు. గత సంవత్సరం 25లక్షల చేప పిల్లల్ని వదిలారని, ఈ సారి ఆలస్యంగా పంపిణీ చేశారని తెలిపారు. ఈ సారి ప్రభుత్వం ప్రాజెక్టుకు 25 లక్షల చేప పిల్లలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మత్స్యకారుల పక్షాన పోరాడుతానన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలో 364 చెరువుల్లో 3.25కోట్ల చేప పిల్లలను ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి మరింత రాయితీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పంపిణీ ప్రక్రియ ఆలస్యమైనందున అధికారులు త్వరితగతిన చెరువుల్లో చేప పిల్లలను వదలాలని, వారికి మత్స్య సంపద జీవనధారమని సూచించారు.. కార్యక్రమంలో ఫిషరీస్ ఏడీతో పాటు మత్స్యకార సంఘం నాయకులు, కౌన్సిలర్లు గౌతం పింగ్లే, రావుల సువర్ణ పోశెట్టి, పిఎసిఎస్ డైరెక్టర్ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, నాయకులు సోలంకే భీంరావు, రమేష్, పండిత్‌రావు పటేల్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ తోట లింగురాం, బిజెపి పట్టణ అధ్యక్షులు మల్లేష్, నాయకులు తుమ్మోల్ల దత్తాత్రి పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన సార్క్ నేషన్ సభ్యులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ మున్సిపాలిటీ కమిషనర్ సీవీఎస్ రాజును సార్క్ నేషన్స్ ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ సభ్యులు కలిశారు. బుధవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కలిసి శాలువా పూల బొకేతో సన్మానించారు. ఈ సందర్భంగా సార్క్ హ్యూమన్ రైట్స్ గురించి కమిషనర్‌కు వివరించారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి నీరటి ఉదయ్ కిరణ్, జిల్లా చైర్మన్ రాజ్ సిద్ధార్థ్, సభ్యులు శివకుమార్, షేక్ ఆలం, సందీప్ పాల్గొన్నారు.

పశువైద్యాధికారికి ఆత్మీయ వీడ్కోలు

నవతెలంగాణ-సారంగాపూర్



మండల పశువైద్యాధికారి షేక్ ముక్తార్ 11 సంవత్సరాలుగా పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లారు. బుధవారం మండల కేంద్రానికి చెందిన రైతులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారిని గ్రామస్తులు శాలువాతో సత్కరించి మోమెంటోలను అందజేశారు. రైతులకు అందించిన సేవలను కొనియాడారు. నూతనంగా వచ్చిన వైద్యాధికారి శ్రీకర్ రాజు సైతం పశు పోశకులకు అందుబాటులో ఉండి పని చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు బొల్లోజి నర్సయ్య, మాజీ సర్పంచ్ సుజాత నర్సారెడ్డి, గోనింద్ రెడ్డి, నారాయణ రెడ్డి, మాణిక్ రెడ్డి, భోజారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కేవీకే ఆధ్వర్యంలో ఉచిత మెగా పశువైద్య శిబిరం



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని సకినాపూర్ గ్రామంలో బుధవారం కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ఆధ్వర్యంలో పశు వైద్య శాఖ సౌజన్యంతో మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వెటర్నరీ జేడీ కిషన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. గ్రామంలోని పశువులకు పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులను ఎల్లప్పుడూ కంటి రెప్పలా కాపాడాలన్నారు. పశుగణన పెంచే విధంగా అందరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తలమడుగు పశు వైద్యులు లావణ్య, కేవీకే శాస్త్రవేత్తలు డా.రాజశేఖర్, డా.మోహన్ దాస్, డా.శివ చరణ్, పశు వైద్య సిబ్బంది సౌమ్య, విజయ్, గంగన్న, ఆశన్న, రాజు, జంగు, సాయి పాల్గొన్నారు.

టీయూటీఎఫ్ పోస్టర్లు విడుదల చేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-నేరడిగొండ

టీయూటీఎఫ్ సభ్యులు బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే అనిల్ జాధవ్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఈనెల 10, 11 తేదీలలో ఆదిలాబాద్‌లో జరిగే 6వ రాష్ట్ర విద్యా మహాసభలకు హాజరు కావాలని ఆహ్వాన పత్రికను అందజేసి పోస్టర్లను విడుదల చేయించారు. ఇందులో టీయూటీఎఫ్ నాయకులు సురేష్ వైద్య, కిరణ్, నారాయణ రెడ్డి, ప్రవీణ్ ఉన్నారు.

సైబర్ నేరాల పట్ల వయోవృద్ధులు అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సైబర్ నేరగాళ్లు వయోవృద్ధులను లక్ష్యంగా చేసుకొని నేరాలకు పాల్పడుతూ డబ్బులను కాజేస్తున్నారని, దీనిపై అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ డీఎస్పీ హసీబ్ ఉల్లా అన్నారు. బుధవారం పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ భవనంలో సీనియర్ సిటిజన్లకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఐటీ కోర్ సిబ్బంది సైబర్ నేరాగాళ్లు ఫోన్ చేసే విధానం, ఓటీపీ అడిగే తీరుపై రూపొందించిన వీడియోను చూపించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ డీఎస్పీ మాట్లాడుతూ ఇటీవల కాలంలో సైబర్ నేరగాళ్లు వయోవృద్ధులను లక్ష్యంగా చేనుకుంటున్నారన్నారు. హైదరాబాద్‌లో ముగ్గురు సీనియర్ సిటిజన్ల నుంచి దాదాపు రూ.10 కోట్లను దోచుకున్నారని తెలిపారు. అందుకే సైబర్ మోసాలపై అధికారుల ఆదేశాల మేరకు వయోవృద్దులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. పార్ట్‌టైం జాబ్, యాప్‌లో డబ్బులు పెట్టితే లాభాలు వస్తాయని చెబుతారన్నారు. కొన్ని రోజులు లాభాలు ఇచ్చి తరువాత యాప్‌ను క్లోజ్ చేస్తారన్నారు. ఇలాంటి ఘటనలు పట్టణంలో జరిగాయని అనేక మంది డబ్బులను పొగొట్టుకున్నారన్నారు. అపరిచిత నంబర్ల నుంచి కాల్ వచ్చి ఓటీపీలు అడిగితే చెప్పొద్దన్నారు. సైబర్ మోసానికి గురైతే 1930కు కాల్చేయాలని సూచించారు. కార్యక్రమంలో వయోవృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ దేవిదాస్ దేశ్పాండే, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

దండారి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-నార్నూర్

గాదిగూడ మండల పరిధిలోని ఆదివాసీ గ్రామాల్లో దండారి ఉత్సవాలు నిర్వహించిన ఉత్సవ కమిటీ సభ్యులకు బుధవారం పటేళ్ల చేతుల మీదగా 69 దండారి చెక్కులు అందజేశారు. ప్రపంచంలోనే ఆదివాసులో అతిపెద పండుగ దీపావళి పండగను వారం రోజులు సంస్కృతి సాంప్రదాయ బద్ధంగా ఘనంగా నిర్వహించారు. దీపావళి పండుగకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందిచినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆడ చంద్రకళ రాజు, ఆదివాసీ విద్యార్థి సంఘ ప్రధాన కార్యదర్శి పెందూర్ సంతోష్, గ్రామ పటేల్ ఆత్రం నాగోరావ్, ఉపాధ్యాయులు రామారావ్, ఆర్కా యాదగిరి, సిడాం నాగోరావ్, పండు, ఆయా గ్రామాల పటేళ్లు ఉన్నారు.

ఒక్క కుటుంబం వదలకుండా సర్వే

- కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ : సర్వే వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రాజర్షి షా

సమగ్ర ఇంటింటి సర్వేలో ఏ ఒక్క కుటుంబం, మనిషి వదలకుండా పూర్తి స్థాయిలో పకడ్బందీగా సర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఎన్యూమరేటర్లు, అధికారులకు సూచించారు. బుధవారం నుంచి ప్రారంభమైన ఇంటి గుర్తింపు సర్వే, స్టిరింగ్ ప్రక్రియను వార్డు నంబర్ 37 పరిధిలోని ఓల్డ్ హౌజింగ్ బోర్డులో పరిశీలించారు. ఇండ్ల గుర్తింపు, వివరాల నమోదు, స్టిక్కరింగ్ చేస్తున్న పని తీరును చూసి పలు సూచనలు చేశారు. కాలనీకి వచ్చిన కలెక్టర్తో పాటు ఇతర అధికారులను సత్కరించారు. జిల్లా వ్యాప్తంగా బుధవారం నుంచి ఇండ్ల గుర్తింపు సర్వే ప్రారంభమైందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో లక్ష 97 వేల కుటుంబాలను గుర్తించామన్నారు. ఎన్యూమరేటర్లను నియమించామని, 213 మంది సూపర్‌వైజర్లతో పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఎస్జీటీ ఉపాధ్యాయులను సర్వేలో భాగం చేయాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు 4, 5 తేదిల్లో వారికి శిక్షణ ఇచ్చామన్నారు. పట్టణంలో అధిక శాతం అద్దెకు ఉంటున్నారని, ఇతర ప్రాంతాల్లో ఉండే వారు అక్కడే వారి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. సర్వే కోసం వచ్చే సిబ్బంది ఆధార్, రేషన్, పాట్టపాస్ బుక్ ఇతర వివరాలను తెలియజేయాలని సూచించారు. సర్వేలో సరైన వివరాలను అందించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీవీఎస్ రాజు, డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, వార్డు కౌన్సిలర్ అశోక్ పాల్గొన్నారు.

సర్వేలో నిర్లక్ష్యం వహించిన ఇద్దరికి షోకాజ్ నోటీసులు

ఇచ్చోడ : మండలంలోని గెర్జం, ముఖర-కె గ్రామాల్లో బుధవారం సామాజిక, ఆర్థిక, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా ప్రారంభమైన ఇండ్ల జాబితా సర్వేను కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. ఇచ్చోడ మండలం ముఖర-కెలో సేంద్రీయ ఎరువుల తయారీ కేంద్రాన్ని, ఏపుగా పెరిగిన టెకుచెట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా గెర్జం గ్రామంలో ఇళ్ల జాబితా సర్వే సరిగా నిర్వహించకపోవడం, స్టిక్కర్లపై సరైన వివరాలు నమోదు చేయకపోవడం, సర్వేకు సంబంధించి మ్యాప్ ఎక్కడి నుండి ఎక్కడి వరకు సర్వే నిర్వహించాలో ముందుగా నిర్ధారించక పోవడం, సర్వేలో తప్పులు నమోదు చేయడంతో ఎంపీడీఓ లక్ష్మణ్, ఏఓ కైలాస్, పంచాయితీ సెక్రటరీ సయ్యద్ ఏజాజ్ హుస్మిలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కార్యక్రమంలో సీఈఓ జితేందర్ రెడ్డి, తహసల్దార్ సత్యనారాయణ పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్

నవతెలంగాణ-నిర్మల్

గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులను ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని, వేతనాలకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు బొమ్మెన సురేష్ అన్నారు. బుధవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామపంచాయతీ సిబ్బంది బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలన్నారు. ప్రభుత్వం ఈ మధ్య ప్రకటించిన పంచాయతీరాజ్ శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ ఉద్యోగులకు నేరుగా వేతనాలు ఇస్తున్నారని, గ్రామపంచాయతీ సిబ్బంది సైతం అలానే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ వ్యవస్థ ఏర్పడి 60 సంవత్సరాలు గడిచిన సిబ్బందిని పర్మినెంట్ చేయకపోవడం బాదకరమన్నారు. నవంబర్ 20వ తేదీలోపు గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన సమస్యలన్నింటిని పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు జిల్లా ఆకాష్, పోశెట్టి, శేఖర్, శ్రీనివాస్, పోశెట్టి పాల్గొన్నారు.

ఆశాలపై మండల అధికారుల బెదిరింపులు ఆపాలి

ఆశాలపై మండల అధికారుల బెదిరింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్, తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రకళ, గంగామణి, గౌరవ అధ్యక్షురాలు సుజాత బుధవారం ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నారు. ఆశా వర్కర్స్ చేసే పనిని బట్టి పారితోషకంపై పని చేస్తున్నారని తెలిపారు. కుల గణన సర్వే చేయమని కలెక్టర్, డీఎంహెచ్ఓను కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. దానికి అధికారులు సానుకూలంగా స్పందించారని, సర్వేలో పాల్గొనాల్సిన అవసరం లేదని తెలిపారని వెల్లడించారు. కానీ మండల స్థాయి అధికారులు మాత్రం బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఆశాలను ఇబ్బందులకు గురి చేయొద్దని లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

మద్దతు ధర కల్పించేందుకే సీసీఐ కేంద్రాలు

- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

నవతెలంగాణ-కుభీర్

మార్కెట్‌లో పత్తి రైతుకు మద్దతు ధర కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ద్వారా సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సీసీఐ కొనుగోళ్లు ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి మద్దతు ధరలు పెంచిందన్నారు. రైతులకు ఇబ్బందులు పెట్టకుండా కొనుగోలు జరపాలని అధికారులకు సూచించారు. రైతులు 8 నుండి 12 తేమ శాతం ఉండేలా చూడాలన్నారు. క్వింటాలుకు రూ.7521 మద్దతు ధర ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రాలలో పంటను అమ్మి లబ్ధి పొందాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గంగాచారణ్, బీజేపీ మండల అధ్యక్షులు దత్తాత్రి, నాయకులు గులాబ్, వడ్నం నాగేష్, నాగేందర్, కందుర్ కనకయ్య, సాయినాథ్, నరసప్ప, మార్కెట్ కమిటీ కార్యదర్శి గంగన్న, వ్యాపార వేత్త సంతోష్ సేట్, ఆనంద్, రైతులు పాల్గొన్నారు.



కుభీర్ : కాంటాకు పూజలు చేసి కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



నేరడిగొండ : రెబ్బెన్ కట్ చేసి కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నేరడిగొండ : మండల కేంద్రంలోని దర్శిని జిన్నింగులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే అనిల్ జాధవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతును శాలువతో సన్మానించి పత్తితో వచ్చిన ఎడ్ల బండికి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు తేమ విషయంలో సహకరించాలని, జిల్లాలో మంచు ఎక్కువగా పడే సందర్భంగా తేమ శాతం ఎక్కువ చూపిస్తుందని దాని వల్ల రైతులు నష్టపోతారన్నారు. అదేవిధంగా ప్రభుత్వం రైతుల పక్షాన ఆలోచించి మద్దతు ధర పెంచాలన్నారు. ఈ సందర్భంగా సీసీఐ అధికారులు ఎమ్మెల్యేను శాలువతో సన్మానించారు.

రైతు శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే బొజ్జు



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండలంలోని బాధనకుర్తి గ్రామంలో వరి ధాన్యం కొనుగోళుకేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే సూచించారు. కొనుగోళుకేంద్రంలో అమ్ముకొని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు రూ.2,206 పొందాలని తెలిపారు. సన్నరకానికి అధనంగా రూ.500 బోనస్‌గా ఇస్తుందన్నారు. కొనుగోలు సెంటర్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, పంట రుణాలను విడుతలుగా మాఫీ చేయడం వల్ల రైతులు బ్యాంకుల్లో డిఫాల్టర్‌లుగా మారరని తెలిపారు. తమ ప్రభుత్వం ఏక కాలంలో రూ.రెండు లక్షల వరకు రుణమాఫీ చేసిందని గుర్తుచేశారు. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్న ప్రభుత్వం తమదేనని వివరించారు. ప్రతి పక్ష నాయకులు ప్రజల మేలును ఆలోచించకుండా ప్రభుత్వాన్ని దూషించమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. రైతులను తప్పు దోవపట్టించాలని చూస్తున్న బీఆర్ఎస్ నాయకుల మాటలు నమ్మద్దని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దయానంద్, చిన్నం సత్యం, గాజుల గంగన్న, జంగిలి శంకర్, కడార్ల గంగనర్సయ్య, గుడాల రాజన్న తోట సత్యం, ఐకేపీ సీసీ పాల్గొన్నారు.

5కిలో మీటర్లు నడిచి.. చికిత్సలు అందించి..



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

రక్త హీనతతో బాదపడుతున్న గిరిజన గర్భిణీకి అంకోలి పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ సర్ఫారాజ్ ఐదు కిలో మీటర్లు నడిచి వైద్యం అందించారు. మండలంలోని ఖండాల సబ్ సెంటర్‌లో గల రాజు గూడకు చెందిన టెకాం శాంతబాయికి రక్తం ఐదు శాతం ఉండటంతో ఆశా వర్కర్లు రిమ్స్‌కు రావాలని సూచించారు. ఆమె నిరాకరించడంతో విషయం తెలుసుకున్న డాక్టర్ గ్రామానికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు ఇచ్చారు. గర్భిణీకి కౌన్సెలింగ్ ఇవ్వడంతో ఆమె ఆస్పత్రికి వచ్చేందుకు సిద్ధమైంది. కాగా అటూ పీహెచ్‌సీలో వైద్యులు గర్భిణీలకు పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ మోహిజాద్దీన్, ఆరోగ్యకార్యకర్తలు రాథోడ్ చంద్రకళ, పవర్ ప్రేమ్ సింగ్, ఆశాకార్యకర్త పాల్గొన్నారు.

ప్రజలు రోడ్డు భద్రత నియమాలను పాటించాలి

- 20 ట్రాఫిక్ స్టాపర్‌లను ప్రారంభించిన ఎస్పీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రోడ్డు భద్రత నియమాలను ప్రజలందరూ పాటించాలని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. బుధవారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో స్టాపర్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొని విరాళంగా ఇచ్చిన 20 స్టాపర్లను అతిథుల సమక్షంలో ప్రారంభించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉన్నందున ట్రాఫిక్ సీఐ విజ్ఞప్తి మేరకు అడిగిన వెంటనే 20 అత్యంత నాణ్యత కలిగిన స్టాపర్లను ఓం ప్రకాష్ అగర్వాల్ వారి కుమారులు జిల్లా పోలీసు వ్యవస్థకు అందజేశారు. ఈ స్టాపర్లు దాదాపు రూ.3 లక్షల విలువ ఉంటాయని ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలందరూ ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, హెల్మెట్ ద్విచక్ర వాహనంపై, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాన్ని నడపవద్దని, అతివేగం ప్రాణాలకు హానికరం అనే విషయాలను తెలియజేస్తూ ఉన్న 20 స్టాపర్లను ఆవిష్కరించారు. ఈ స్టాపర్లను రద్దీ ఎక్కువగా ఉన్న ప్రదేశాలలో ట్రాఫిక్ నియంత్రణకై వినియోగించాలని సూచించారు. స్టాపర్లను అందజేసిన అగర్వాల్ కుటుంబానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. సమాజ సేవలో ముందుంటూ తనకంటూ పట్టణంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించిన అగర్వాల్ ఓం ప్రకాష్ వారి కుటుంబ సభ్యులకు శాలువా పూలమాలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో అమిత్ అగర్వాల్, గజానంద్ అగర్వాల్, పట్టణ సీఐలు సునీల్, కరుణాకర్, ప్రణయ్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

రక్షణ చర్యల్లో భాగమే కార్డెన్ సెర్చ్



నవతెలంగాణ-కడెం

ప్రజల రక్షణ చర్యలలో భాగమే కార్డ్ అండ్ సెర్చ్ నిర్వహిస్తారని ఖానాపూర్ సీఐ సైదారావు అన్నారు. బుధవారం మండలంలోని కొత్త మద్దిపడగలో సీఐ ఆధ్వర్యంలో పోలీసులు కార్డ్ అండ్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇళ్లలో సోదాలు నిర్వహించి సరైన పత్రాలు లేని 51 ద్విచక్ర వాహనాలు, 2 కార్లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు యువకులు దూరంగా ఉండాలన్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, వాటివల్ల దొంగతనాలు, నేరాలు జరగకుండా ఉంటుందన్నారు. అలాగే గ్రామంలో ఎవరైనా అనుమానస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. వాహనదారులు ప్రతి ఒక్కరు తమ వాహనానికి సంబంధించిన అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే ఉపేక్షించేది లేదని, వారిపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కడెం, ఖానాపూర్, దస్తూరాబాద్ ఎస్సైలు ఎమ్.కృష్ణ సాగర్ రెడ్డి, రాహుల్ గైక్వాడ్, ఆర్.శంకర్, ఏఎస్సైలు భీమ్‌రావు, పోలీస్ స్టేషన్ సర్కిల్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆలయ కమిటీ ఆహ్వానం

ఖానాపూర్ : శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి 40వ బ్రహ్మోత్సవాలకు రావాలని ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్ నాయక్‌కు ఆహ్వానం అందించారు. బుధవారం ఆలయ కమిటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలో ఈనెల 12 నుంచి 16 వరకు జరిగే శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

విద్యార్థి ఆకస్మిక మృతి బాధాకరం

నిర్మల్ : నిర్మల్ జిల్లాంకేద్రంలోని మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి ఆకస్మికంగా మృతి చెందడం బాధాకరమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు డా.ఉప్పు కృష్ణంరాజు, అధ్యక్షులు ఎంబడి.చంద్రశేఖర్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీసీ సంక్షేమ సంఘం తరుపున విద్యార్థి మృతికి తీవ్ర సంతాపం తెలుపుతూ, విద్యార్థి కుటుంబానికి సానుభూతిని వ్యక్తం చేశారు.

17న జాతీయ స్థాయి కరాటే పోటీలు

నవతెలంగాణ-సిర్పూర్(టి)



జాతీయస్థాయి కరాటే, కుంఫు టోర్నమెంట్ ఈనెల 17న నిర్వహిస్తున్నట్లు డ్రాంకెన్ మార్షల్ ఆర్ట్స్ జిల్లా అధ్యక్షుడు కుకూడే సంతోష్ తెలిపారు. సన్నీ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 17న ఐదవ జాతీయ స్థాయి కరాటే, కుంఫు టోర్నమెంట్‌ను కాగజ్‌నగర్‌లోని పటేల్ గార్డెన్‌లో ఆదివారం ఉదయం ఉంటాయని, ఈ టోర్నమెంట్లో తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి క్రీడాకారులు హాజరవుతారని తెలిపారు. ఈ టోర్నమెంట్లో ఆసక్తి ఉన్న యువత పాల్గొనవచ్చాన్నారు. మరిన్ని వివరాలకు 9848261127 ద్వారా సంప్రదించాలని కోరారు.

పిల్లలదే తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత

నవతెలంగాణ-కాగజ్‌నగర్



తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత వారి పిల్లలదేనని సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ అన్నారు. బుధవారం కార్యాలయంలో అసోషియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. వయోవృద్ధుల సంక్షేమ చట్టం-2007, 2011 ప్రకారం తల్లిదండ్రుల పోషణ బాధ్యత వారి పిల్లలదేనని, దీనిని ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉందన్నారు. పిల్లలకు ఇచ్చిన ఆస్తులను కూడా వెనక్కి తీసుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో అసోషియేషన్ సభ్యులు నారాయణ, ఎస్ఆర్ మూర్తి, కలికోట రమణయ్య, బావండ్లపల్లి నర్సయ్య రామయ్య, నాగేశ్వర్‌రావు, కోటేశ్వర్, వాహాబ్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధితో బాలికల స్వయం సమృద్ధి సాధ్యం

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యాభివృద్ధితో బాలికల స్వయం సమృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం అంతర్జాతీయ బాలిక దినోత్సవం పురస్కరించుకొని మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో డీడబ్ల్యూఓ భాస్కర్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన వేడుకలకు అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు లేకపోతే మానవజాతికి మనుగడలేదని, మహిళల అభివృద్ధి, సంక్షేమం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. బాలికలు, మహిళలు అన్ని రంగాలలో రాణించాలని, విద్య, శాస్త్ర, సాంకేతిక, రాజకీయ రంగాలలో పురుషులతో సమానంగా పోటీపడి రాణిస్తున్నారని, ఇటీవల సివిల్ పరీక్షలలో మహిళలే ప్రథమ స్థానాలు సాధిస్తున్నారన్నారు. బాలికలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, ఏకాగ్రతతో కష్టపడి చదివి ఉన్నత స్థానాన్ని చేరుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల సంక్షేమంలో భాగంగా విద్య, వైద్యం వంటి ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నాయని, భేటీ బచావో, భేటీ పడావో కార్యక్రమం ద్వారా బాలికల సంక్షేమం కోసం కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అంతకు ముందు ఎమ్మెల్యే కోవలక్ష్మి మాట్లాడుతూ బాలికల సంక్షేమం పట్ల అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తుందని, ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను వినియోగించుకుని బాలికలు అన్ని రంగాలలో రాణించాలని అన్నారు. బాలికలు వారి తల్లిదండ్రులపై ప్రేమతో కష్టసుఖాలలో భాగస్వాములు అవుతారని, ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని కష్టపడి చదివి సాధించే దిశగా కృషి చేయాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన అంగన్‌వాడీ కేంద్రాలలో చదివే చిన్నారులకు బహుమతులు అందజేశారు. జిల్లాలోని 32 బాలికల ఆశ్రమ పాఠశాలలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలలో చదువుతున్న విద్యార్థినులకు నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బాలికలు చేసిన నృత్య ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారాం, జీసీడీఓ శకుంతల, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు అలీబిన్ అహ్మద్, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు, సఖి, జిల్లా మహిళా సాధికారత సంస్థ సిబ్బంది, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ఎస్ఓలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరి ధాన్యం కొనుగోలు సమర్థవంతంగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా మద్దతు ధర నిర్ణయించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే క్రమంలో తేమ, తప్ప, తాలు ఇతర అంశాలలో పాటించాల్సిన జాగ్రత్తలను వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని, కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. సన్నరకం వడ్లకు ప్రభుత్వం రూ.500 బోనస్ అందిస్తుందని, ఈ క్రమంలో సన్నరకం, దొడ్డురకం వడ్ల సేకరణకు వేర్వేరుగా కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులున్నారు.

మంగళయాన్‌పై వర్క్‌షాప్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మంగళయాన్ (మార్స్ అర్బిటరీ మిషన్)పైవర్క్‌షాప్ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన హైద్రాబాద్‌లోని ప్లానిటరీ సైన్స్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ రఘునందన్ కుమార్ మాట్లాడుతూ 2013లో భారతదేశం అంగారకుడిపై పరిశోధన కోసం మంగళయాన్ ప్రయోగించిన ఎన్నో రహస్యాలను తెలుసుకున్నట్లు తెలిపారు. ఇస్రో ప్రయోగిస్తున్న వివిధ ఉపగ్రహాల గురించి ఆయన ప్రొజెక్టర్ ద్వారా విద్యార్థులకు వివరించారు. అంతరిక్షంలోకి ఉపగ్రహాలను పంపే విధానం, రాకెట్‌ల పనితీరు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కటకం మధూకర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి, వైస్ ప్రిన్సిపల్ లక్ష్మీనరసింహం, అకడమిక్ కో ఆర్డినేటర్ డి జనార్దన్, కార్యక్రమ సమన్వయకర్త బి రోజ్‌మేరి, అధ్యాపకులు, డిగ్రీ కళాశాల మరియు నవోదయ విద్యాలయం విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర సెపక్ తక్రా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా భాస్కర్

నవతెలంగాణ-రెబ్బెన

తెలంగాణ రాష్ట్ర సెపక్ తక్రా సంఘం ఎన్నికల్లో నూతన తెలంగాణ రాష్ట్ర సెపక్ తక్రా క్రీడాలో గోలేటి సింగరేణి పాఠశాల వ్యాయామం ఉపాధ్యాయులు కె భాస్కర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎన్నికయ్యారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.ఎల్ నరసింహ రావు తెలిపారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియం పతే మైదానం క్లబ్‌లో జరిగిన ఎన్నికలో 2024 నుండి 2028 సంవత్సరం వరకు ఏకగ్రీవంగా ఎన్నిక అయినారు. తెలంగాణ రాష్ట్ర సెపక్ తక్రా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎన్నికైనందుకు పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

బీటీ రోడ్లకు మోక్షమెప్పుడో..?

- గుంతలయంగా మారిన మట్టి రోడ్లు
- ప్రయాణించేందుకు అవస్థలు పడుతున్న జనం
- పట్టించుకోని పాలకులు, అధికారులు

ఏండ్లుగా ఆ పల్లెలు తారు రోడ్డు ఎరగడం లేదు. మట్టి రోడ్లపై అవస్థల మధ్య ప్రయాణం సాగిస్తున్నారు. వర్షాకాలంలో బురదమయంగా మారుతుండటం.. పెద్ద పెద్ద గుంతలు పడి ఉండటంతో వీటిపై ప్రయాణం ఆ పల్లెలకు నరకప్రాయాన్ని తలిపిస్తోంది. అధికారుల నిర్లక్ష్యం, పాలకుల పట్టింపులేనితనంతో గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేక గోండుగూడ,ఇందపూర్, ఉమ్రి గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులు పడుతున్న వైనం పై ప్రత్యేక కథనం...

నవతెలంగాణ- కెరమెరి

మండలంలోని ఇందపూర్,ఉమ్రి,గోండు గూడ గ్రామాలు మండల కేంద్రం నుంచి సుమారు 15 కిమి దూరంలో ఉన్నాయి. ఈ గ్రామాలకు మండల కేంద్రం నుంచి అగర్వాడ గ్రామం వరకు బీటీ రోడ్డు సౌకర్యం ఉంది.అగర్వాడ నుంచి ఇందపూర్, గోండు గూడ వరకు అటవీ ప్రాంతం ఉంది.ఈ రెండు గ్రామాల మధ్య సుమారు 2కి.మీ దూరం మట్టి రోడ్డు అటవీ శాఖ పరిధిలో ఉండడంతో నిధులు మంజూరు కాక బీటీ రోడ్డు పనులకు మోక్షం కలగడం లేదు.నిధులు మంజూరు అయిన అటవీ అనుమతుల కారణంగా మధ్యంతరంగా నిలిచిపోయే పరిస్థితి. దీంతో బీటీ రోడ్డుకు మోక్షం కలుగుతుందో లేదోనని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మట్టి రోడ్డుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అటవీ అనుమతుల సమస్యను పరిష్కరించాలని గతంలో పలుమార్లు పాలకుల దృష్టికి తీసుకెళ్లినప్పటికి ఫలితం లేకుండా పోతుందని పరిసర గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

గుంతలతో పొంచి ఉన్న ప్రమాదం

ఈ దారి గుండా నిత్యం ఆరు గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రాకపోకలు కొనసాగిస్తుంటారు. ఆటోలు, ద్విచక్ర వాహనాల ద్వారా రాకపోకలు కొనసాగిస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం కురిసిన భారీ వర్షాలకు రోడ్డు పొడవునా గుంతలు ఏర్పడ్డాయి. అక్కడక్కడ పెద్దపెద్ద గుంతలు ఏర్పడి రాళ్లు తేలాయి. దీంతో రాకపోకలకు ప్రయాణకులు అష్ట కష్టాలు పడుతున్నారు. పగటిపూట వాహనదారులకు ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోనప్పటికీ, రాత్రిపూట ఈ రోడ్డు గుండా ప్రయాణించాలంటేనే భయభ్రాంతులకు గురవుతున్నారు. రాత్రుల్లో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడిపోయిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పటికైనా పాలకులు అధికారులు స్పందించి అగర్వాడ గ్రామాల మధ్య బీటీ రోడ్డు మంజూరు చేయాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కొత్త ప్రభుత్వం పైనే ఆశలు..

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడాదిగా వస్తుంది. గత ప్రభుత్వ హయాంలో అనేకమార్లు ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు రోడ్డు పనుల నిర్మాణానికి పాలకులకు అధికారులకు విన్నవించినప్పటికీ ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. కొత్తగా వచ్చిన ప్రభుత్వమైన రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.అటవీ అనుమతుల కోసం యంత్రాంగం చర్యలు చేపట్టాలని ఇందపూర్, గోండు గూడ, చిత్తగూడ,దేవుడు పల్లి, నిషాని, ఉ మ్రిగ్రామాల ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

బీటీ రోడ్డు మంజూరు చేయాలి

ఆడె అరుణ్ కుమార్, ఇందపూర్

అటవీ అనుమతులు వస్తే రోడ్డు పనులకు ముందడుగు పడే అవకాశం ఉంది. ఎన్నో ఏళ్ల నుండి అగర్వాడ, ఉమ్రి గ్రామాల మధ్య బీటీ రోడ్డు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.గతంలో పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది.ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి బీటీ రోడ్డు మంజూరుకు కృషి చేయాలి.

విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని వాంకిడి మండల కేంద్రంలో గల గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారం వల్ల అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం రాత్రి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మ్యాక్స్ కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను కలిసి పరామర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని వైద్యుల ద్వారా తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి క్షేమంగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ముగ్గురు విద్యార్థులను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించామన్నారు. హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ముగ్గురిని మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ పరామర్శించారు. కార్యక్రమంలో బాధిత విద్యార్థుల కుటుంబ సభ్యులు, వైద్యులు పాల్గొన్నారు.

బాధితులకు మహిళా కమిషన్ సభ్యురాలు పరామర్శ

వాంకిడి మండల కేంద్రంలోని గిరిజన పాఠశాలలో కలుషిత ఆహారంతో అస్వస్థతకు గురై స్థానిక లైఫ్ లైన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న త్రిష, సాయికీర్తనలను రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరిబాయ్, ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యురాలు నీలాదేవితో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. బాధిత విద్యార్థినులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. హాస్టల్‌లో జరిగిన సంఘటనపై విచారణ జరిపించి సరైన న్యాయం చేసేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసాద్‌తో పాటు విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్
- కలెక్టరేట్ కార్యాలయం ఎదుట

నవతెలంగాణ-ఆసిఫాబాద్



గ్రామపంచాయతీలలో కొనసాగుతున్న జీఓ నెంబర్ 51తో పాటు మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ సిబ్బంది బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని పంచాయతీరాజ్ శాఖ గ్రామీణ అభివృద్ధి శాఖ ఉద్యోగులకు నేరుగా వేతనాలు ఇచ్చే విధంగా గ్రామపంచాయతీ సిబ్బంది కూడా వేతనాలు ఇవ్వాలని గ్రామపంచాయతీ సిబ్బంది అందరిని పర్మినెంట్ చేయాలన్నారు. వేతనాలకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. కారోబార్ బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలన్నారు. పాత కేటగిరిలన్నింటిని యధావిధిగా కొనసాగించాలని, విలేజ్ వాటర్ అసిస్టెంట్‌గా నియమిస్తున్న సిబ్బంది అందరికీ సీనియార్టీ పరిగణలోకి తీసుకోవాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. విధి నిర్వహణలో ప్రమాదం జరిగి మరణించిన సిబ్బంది కుటుంబానికి రూ.10లక్షల నష్టపరిహారం ప్రభుత్వం ఇవ్వాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మోరేశ్వర్ శ్రీకాంత్, గంగారం, నగేష్, రమేష్, పుష్పలత, శంకర్, శ్రీనివాస్, వసంత్, అనిల్, సంజీవ్, లక్ష్మి పాల్గొన్నారు.

బీమా సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-వాంకిడి

తెలంగాణ గ్రామీణ బ్యాంక్ కల్పిస్తున్న బీమా సౌకర్యాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ మేనేజర్ కృష్ణ అన్నారు. మండలకేంద్రానికి చెందిన జాడి రేఖ ఇటీవల మృతి చెందగా ప్రధానమంత్రి జీవన్ జ్యోతి పథకం కింద తెలంగాణ గ్రామీణ బ్యాంక్ నుంచి రూ.రెండు లక్షలు మంజూరైనట్లు మేనేజర్ తెలిపారు. ఈ మేరకు నామినీగా ఉన్న మృతురాలి భర్త జాడే రమేష్‌కు బుధవారం బీమా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ శ్రీముఖ్, అకౌంటెంట్ శ్రీనివాస్, క్యాషియర్ మనోజ్ కుమార్, సీఎస్‌పీ ప్రతినిధి దుర్గం రాకేష్ పాల్గొన్నారు.

నూతన జిల్లా వైద్యాధికారికి సన్మానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన సీతారామ్‌ను వైద్య సంఘాలు సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలు సమస్యలు నూతన జిల్లా వైద్యాధికారి దృష్టికి తీసుకువెళ్లగా పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ 3194 సంఘం జిల్లా అధ్యక్షులు డి.ఐజాక్, ఆయుష్ విభాగం డాక్టర్ నాగరాజు, తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు శ్యామలాల్, నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ఉద్యోగులకు అవగాహన



నవతెలంగాణ-రెబ్బెన

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జనరల్ మేనేజర్ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నేరాలు పెరుగుతున్నాయని ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. సెల్ ఫోన్‌కు బ్యాంక్ సిబ్బంది, లాటరీ పేరుతో మెసేజ్, కాల్ వస్తే స్పందిన్చవద్దని చెప్పారు. ఇటీవలే జరిగిన సైబర్ మోసాల గురించి వివరించి ఎలా అప్రమత్తంగా ఉండాలో చెప్పారు. కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ భీంరావ్ జాడే, ఏరియా సెక్యూరిటి ఆఫీసర్ ఉమాకాంత్, డీజీఎం(ఐఈడీ)ఉజ్వల్ కుమార్ బెహేర, పర్సనల్ మేనేజర్ ఆర్.తిరుపతి, ఫైనాన్స్ మేనేజర్ ఎం రవికుమార్, ఎస్సై చంద్రశేఖర్, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కొమురయ్య అన్నారు. బుధవారం మండలంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రామకృష్ణతో కలిసి సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగా సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని, ప్రజలు తమ వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. ఫోన్లలో ఓటీపీ, ఓఎల్ఎక్స్, పేటీఎం, గూగుల్ పే, ఫోన్ పే, కేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్లకు స్పందించకూడదన్నారు. సైబర్ నేరాలకు గురైతే 1930 ట్రోల్ నంబర్‌కు డయల్ చేయాలన్నారు.

సమగ్రంగా ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ, కుల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అదుపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. గురువారం మండల కేంద్రంలో కొనసాగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియ తీరును పరిశీలించి ఎన్యూమరేషన్ బ్లాక్‌ల ప్రకారం ఎన్యూమరేటర్లకు కేటాయించిన లక్ష్యాన్ని నిర్ణీత గడువులోగా ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పూర్తిస్థాయిలో సాధించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వెంకటరావుపేట వద్ద ఏర్పాటు చేసిన పౌరసరఫరాల చెక్ పోస్ట్‌ను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, సంబంధిత అధికారులున్నారు.



సిర్పూర్ (టి): సర్వే వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్



చింతలమానేపల్లి

కాగజ్‌నగర్ : ప్రస్తుతం చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బంధీగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్‌తివారి సూచించారు. బుధవారం కాగజ్‌నగర్ పట్టణంలోని సుభాష్ చంద్రబోస్ కాలనీలో చేపడుతున్న సర్వేను ఆయన కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లాతో కలిసి పరిశీలించారు. ఈ సర్వేలో కుటుంబసభ్యుల వివరాలను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పొందుపర్చాలని సూచించారు. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, ప్రత్యేకాధికారులు సమన్వయంగా పని చేయాలని, ప్రభుత్వం నిర్ణయించిన గడువులోగా సర్వే పూర్తయ్యేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : సమగ్ర సర్వే ఎటువంటి తప్పులు లేకుండా పకడ్బందీగా చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని అడ, మాణిక్‌గూడ, బారెగూడలలో ఎన్యూమరేటర్లు చేస్తున్న సర్వే తీరును పరిశీలించారు. నిర్దేశించిన అంశాల్లో ప్రతి దానిని కూడా లోతుగా పరిశీలించి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా రాన్‌వెల్లి, బాబాపూర్ గ్రామాలలో ఎంపీఓ సుధాకర్ రెడ్డి, సూపర్‌వైజర్లు ఇంటింటి సర్వే నిర్వహించారు. ఎలాంటి తప్పులకు అవకాశం ఇవ్వకుండ, సమగ్ర కుటుంబ సర్వేను సమర్థ వంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

బెజ్జూర్ : మండలంలో కుటుంబ సమగ్ర సర్వేను బుధవారం మండల ప్రత్యేక అధికారి ఎంఏ నదీమ్ ప్రారంభించారు. కుటుంబ సర్వే ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. కుటుంబ సర్వేకు అందరు సహకరించాలని కోరారు. బుధవారం నుండి శుక్రవారం వరకు ఇంటింటా సర్వే చేసి ఇండ్ల వివరాలను సేకరిస్తామని తెలిపారు. అనంతరం సమగ్ర సర్వే ప్రారంభిస్తామని తెలిపారు. మండలంలో 58 మంది ఎన్యూమరేటర్లు, 9 మంది సూపర్‌వైజర్లను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ భుమేశ్వర్, ఎంపీడీఓ గౌరీ శంకర్, గ్రామపంచాయతీ కార్యదర్శులు తుకారం, గురుదాస్, పాల్గొన్నారు.

కౌటాల : కుల గణన సర్వే బుధవారం ప్రారంభమైంది. మండలంలోని అన్ని గ్రామాలలో ఆ గ్రామాలకు కేటాయించిన ప్రభుత్వ ఉపాధ్యాయులు మధ్యాహ్నం పూట కులగణన సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు.

వాంకిడి : మండలంలోని వాంకిడి గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను మండల ప్రత్యేక అధికారి రాథోడ్ భిక్కు, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఎంపీఓ కాజాఅజాజోద్దిన్‌లతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు సర్వే చేస్తున్న సిబ్బందికి కుటుంబ వివరాల సేకరణకు సంబంధించి ఎలాంటి తప్పిదాలు జరగకుండా ఉండటానికి పలు సూచనలు చేశారు. అనంతరం మండలంలోని బంబార గిరిజన ఆశ్రమ బాలుర హాస్టల్, పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అభ్యాసన, హాస్టల్‌లో వారికి అందిస్తున్న భోజన వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వంట గది, మరుగుదొడ్లు పరిశీలించి నాణ్యమైన పరిశుభ్రతతో కూడిన భోజనము మాత్రమే పిల్లలకు అందించాలని, మెనూ తప్పకుండా పాటించాలని సిబ్బందికి సూచించారు. అలాగే హాస్టల్లో కల్పిస్తున్న వసతులపై పిల్లలతో మాట్లాడారు. వారి వెంట తహసీల్దార్ ఎండీ రియాజ్ అలీ, ఎంఈఓ శివచరణ్ హాస్టల్ వార్డెన్ ఉన్నారు.



కౌటాల

రేచిని హైస్కూల్లో ఆర్థిక అక్షరాస్యత



నవతెలంగాణ-తాండూర్

తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రేచిని శాఖ వారి ఆధ్వర్యంలో బుధవారం రేచిని హై స్కూల్లో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ రూరల్ ఫోక్ ఆర్ట్స్ ఆర్గనైజేషన్ కర్నూల్ బృందం కళాకారులు బ్యాంకు పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రుణమాఫీ సామాజిక భద్రత, బీమా పథకాలైన ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ప్రధానమంత్రి జీవనజ్యోతి యోజన అటల్ పెన్షన్ యోజన గురించి తెలిపారు. నగదురహిత లావాదేవీలపై సైబర్ మోసాలపై ప్రజలకు అర్థమయ్యేలా ఆటపాటలు నృత్యరూపకాల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ జి.రాజేందర్, మసెంట్రల్ ఫర్ ఫైనాన్షియల్ లిటిల్ రాసి ఎన్నం అశోక్, రవి, కళాజాత బందం సభ్యులు మెజీషియన్ ఎం తేజ కుమార్, డప్పు ప్లేయర్ వేణు విద్యార్థులు పాల్గొన్నారు.

హైవే రోడ్డుకు అనుసంధానం చేస్తూ సర్వీస్ రోడ్డు నిర్మించాలి

నవతెలంగాణ-జైపూర్



నాగాపూర్-విజయవాడ గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణంలో భాగంగా మండలం మీదుగా టేకుమట్ల శివారులో నిర్మించనున్న హైవే రోడ్డును అనుసందానం చేస్తూ సర్వీస్ రోడ్డు నిర్మించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. బుధవారం మండలంలో కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి పర్యటించిన చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ గోనె నర్సయ్య వినతి పత్రం అందజేశారు. టేకుమట్ల గ్రామస్థుల సౌకర్యార్థం సర్వీస్ రోడ్డు నిర్మించాలని కోరారు.

పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటా



నవతెలంగాణ-జన్నారం

బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటానని ఆ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ అన్నారు. బుధవారం మండలం కాలమడుగు తండాకు చెందిన కార్యకర్త అనిల్ నాయక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి సులువ జనార్ధన్, మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి సిటీమల భరత్ కుమార్, జిల్లా కార్యదర్శి జాడి గంగాధర్, నర నారాయణస్వామి, ఆలయ కమిటీ చైర్మన్ స్వదేశ్ రావ్, జిల్లా నాయకులు ఫజల్ ఖాన్, కే నరసింహులు జునుగురి మల్లయ్య పాల్గొన్నారు.

వడ్ల కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లు పూర్తి చేయాలి



నవతెలంగాణ-తాండూర్

పది రోజుల్లో రైతుల వరి పంట దిగుమతులు వచ్చే అవకాశాలున్నందున వడ్ల కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని బెల్లంపల్లి ఆర్డీఓ హరికృష్ణ సూచించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మండలంలో రైతులు పండించిన వరి రకాలు దిగుమతుల గురించి తెలుసుకున్నారు. వరి పంట దిగుమతలకు అనుగుణంగా వడ్ల కొనుగోలు కేంద్రంలో వసతులు కల్పించాలని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, టెంట్, తేమ, తూకం యంత్రాలు, టార్పాలిన్లు, సన్న వరి ధాన్యం నిర్ధారణ పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వరి ధాన్యానికి సంబంధించి మద్దతు ధర, ఇతర వివరాలు తెలిపేలా బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం వెంటనే కేటాయించిన మిల్లులు, గోదాములకు తరలించాలని సూచించారు. ప్రతి గోదాంలో సీసీ టీవీలను ఏర్పాటు చేయాలన్నారు. స్టాకు రిజిస్టర్‌ను పకడ్బందీగా నిర్వహిస్తూ, ఎప్పటికప్పుడు వివరాలను అధికారులకు అందజేయాలన్నారు. మండల స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేయాలని, కొనుగోలు జరుగుతున్న తీరును పరిశీలించి ఏవైనా సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించాలని సూచించారు. అనంతరం రేచీనిలోని వాసవి మాత రైస్ మిల్లును సందర్శించారు. మిల్లులోని సౌకర్యాలను పరిశీలించారు. ప్రభుత్వానికి బకాయి వడ్ల బియ్యాన్ని వెంటనే అప్పగించాలని మిల్లు యజమానికి సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, కోపరేటివ్ సొసైటీ సెక్రెటరీ శ్రీనివాసులు ఉన్నారు.

పశువుల యజమానికి పరిహారం అందజేత

నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట మండలంలోని మద్దిమాడ శివారులో చిరుత దాడిలో మృతి చెందిన ఆవు దూడ యాజమానికి ఫారెస్ట్ అధికారులు నష్ట పరిహారం అందజేశారు. దేవాపూర్ ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతు ఆడె గోపికి చెక్కును అందించారు. మద్దిమాడ ఫారెస్ట్ బీట్ పరిధిలో మంగళవారం ఉదయం ఆవు దూడపై చిరుత పులి దాడి చేసి చంపగా ఈ మేరకు దేవాపూర్ ఫారెస్ట్ రేంజర్ అనీత చేతుల మీదుగా బాధిత రైతు గోపికి రూ.8000 పరిహారం చెక్కును అందించారు. ఆటవీ ప్రాంతంలో పెద్దపులి, చిరుత పులులకు హాని కలగకుండా చూడాలని కోరారు. వన్యప్రాణులను వేటడానికి ప్రయత్నాలు చేయకూడదని హెచ్చరించారు. అటవీ ప్రాంతంలో మనుషులు ఎవరు కూడా వెళ్లొద్దని పులికి సంబంధించిన సమాచారం తెలిస్తే సంబంధిత అటవీ అధికారులకి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారులు పాల్గొన్నారు.

హస్తంలో అంతర్గత విభేదాలు

- పాత, కొత్త నాయకుల మధ్య కనిపించని సమన్వయం



కాంగ్రెస్ నాయకుల మధ్య మాటల యుద్ధం

నవతెలంగాణ-జైపూర్

మండలంలో కాంగ్రెస్ నాయకుల మధ్య అంతర్గత విభేదాలు బహిర్గతమయ్యాయి. తాజాగా మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ఎదుట ఒకరినొకరు మాటల యుద్ధానికి దిగడం చర్చనీయాంశమైంది. పాత, కొత్త నాయకుల మధ్య సమన్వయం లోపించడం.. వారి మధ్య పొసగకపోవడంతో పార్టీలో విభేదాలకు ఆజ్యం పోస్తుందనే చర్చ జరుగుతోంది. ఇందారం గ్రామ పంచాయతీ పరిధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు బుధవారం శంకు స్థాపన చేసేందుకు వచ్చిన ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామికి నాయకులు తప్ప ప్రజలు కన్పించకపోవడంతో ఈ విషయమై స్థానిక నాయకులను ఎమ్మెల్యే ప్రశ్నించారు. దీనికి తమ పర్యటన వివరాలు నాయకులకు కూడా తెలియడం లేదని, ప్రజలు ఎలా తెలుసుకుంటారని ఎమ్మెల్యేనే నాయకులు ఎదురు ప్రశ్నించారు. ఇది నాయకుల మధ్య మాటల యుద్ధానికి దారి తీసింది. ఎమ్మెల్యే పర్యటన సమాచారం నాయకులకు చేరడం లేదని స్థానిక నాయకుడు జక్కుల వెంకటేశం అనడంతో ఆ పార్టీ మండల అధ్యక్షులు ఫయాజొద్దీన్ కలుగజేసుకున్నారు. ఇద్దరి మధ్య కొంత మాటల యుద్ధం జరిగింది. ఇదే గ్రామంలో నాలుగు నెలల కిందట సైతం వివేక్ పర్యటన సందర్భంగా నాయకుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. తాజాగా అక్కడే ఉన్న శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, స్థానిక ఎస్సై శ్రీధర్ కలుగజేసుకుని గొడవ జరగకుండా జాగ్రత్తపడ్డారు. ఏదేమైనా కాంగ్రెస్ పార్టీలో నాయకుల మధ్య అంతర్గత విభేదాలు పొడచూపుతున్న తీరు మండల స్థాయిలో చర్చనీయాంశంగా మారింది.

పాత ..కొత్తల మధ్య కనిపించని సమన్వయం

కాంగ్రెస్‌లో పాత, కొత్త నాయకుల మధ్య పొసగకపోవడమే విభేదాలకు కారణమవుతోందని తెలుస్తోంది. పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొనసాగిన నాయకులు కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత గులాబీ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. జిల్లా నాయకునిగా కొనసాగుతున్న రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఫయాజొద్దీన్‌తో పాటు గ్రామానికి చెందిన ఒకరిద్దరు కాంగ్రెస్ పార్టీలో ఉంటూ బీఆర్ఎస్ పార్టీకి దూరంగా ఉన్నారు. ఎమ్మెల్యే బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరకముందే వీరు కాంగ్రెస్‌ను అంటిపెట్టుకొని ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీజేపీ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన వివేక్ వెంకటస్వామిని చెన్నూర్ అసెంబ్లీ నుండి గెలిపించుకునేందుకు కృషిచేశారు. అదేవిధంగా వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ సర్పంచులు అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు.

వెనుకా..ముందు

ఇదంతా అసెంబ్లీ ఎన్నికలకు ముందు మండల స్థాయిలో చోటు చేసుకున్న పరిణామాలు. మొదటి నుండి కాంగ్రెస్ జెండా మోస్తూ పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో బీఆర్ఎస్‌కు చెందిన కాంగ్రెస్‌లో చేరి ముందు వరుసలో నిలువడానికి ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో పాత, కొత్త నాయకుల మధ్య విభేదాలు పొడచూపుతున్నాయి. బీజేపీ పార్టీ నుండి కాంగ్రెస్‌లో చేరిన వివేక్ వెంకటస్వామితో పాటు ఆయన కుమారుడు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ గెలుపునకు కృషి చేసిన నాయకులకు ప్రస్తుత పరిస్థితులు మింగుడు పడటం లేదని తెలుస్తోంది. నాయకుల తీరుపై కార్యకర్తలు అసహనానికి గురవుతున్నట్లు తెలుస్తోంది. పార్టీ గెలుపుకోసం నిరంతరం కృషి చేసిన కార్యకర్తల మనోభావాలు దెబ్బతినకుండా నాయకుల మధ్య తలెత్తుతున్న విభేదాలను ఇంతటితో నిలువరించేందుకు ఎమ్మెల్యే చొరవ చూపాలని నాయకులు అభిప్రాయపడుతున్నారు.

అంకితభావంతో పనిచేస్తే సమాజంలో గుర్తింపు



నవతెలంగాణ-తాండూర్

అంకితభావంతో పనిచేస్తే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ తెలిపారు. బుధవారం ఉపాధ్యాయుల జేఏసీ టస్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మండల విద్యాధికారిగా విధులు నిర్వహించి ఇటీవల బదిలీపై వెళ్లిన వాసాల ప్రభాకర్ ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమం సురభి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 9 సంవత్సరాల పాటు మండలంలో విద్యాధికారిగా పని చేసిన ప్రభాకర్ మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నరని తెలిపారు. విద్యాభివృద్ధికి కృషి చేశారన్నారు. నిర్వహణలో బదిలీలు సహజమేనని ఒక్కసారిగా ఆత్మీయుల నుంచి ఎడబాటు కలగడం మనసుకు వెలితిని ఇస్తుందన్నారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని బాధ్యతగా విధులు నిర్వహించి పిల్లలను పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. అనంతరం ఎంఈఓ ప్రభాకర్‌తో పాటు మండలంలో పనిచేసి ఇటీవల బదిలీ ఉద్యోగోన్నతిపై వెళ్లిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు .ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంఈఓ మల్లేశం, విద్యా భారతి విద్యా సంస్థల నిర్వాహకులు శరత్ కుమార్, మండలంలోని ప్రజాప్రతినిధులు సాలిగామ బానయ్య, సిరంగి శంకర్, మాసాడి శ్రీదేవి ,మొగిలి శంకర్ ,ఎండి ఈసా ,ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షులు సురభి శరత్ కుమార్ పాల్గొన్నారు.

అస్వస్థతకు గురైన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు



నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలోని సాయికుంటలో గల గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలోని 12 మంది విద్యార్థినిలు బుధవారం అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థులను వెంటనే చికిత్స నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి తరలించారు. హాస్టల్ సిబ్బంది హాస్టల్లో రోజువారీలాగానే ఉదయం టిఫిన్‌లో విద్యార్థినిలకు కిచిడీ, తయారు చేసి పెట్టారు. అట్టి కిచిడిని హాస్టల్లో 160 మంది విద్యార్థినిలు తిన్నారు. తిన్న తర్వాత 10వ తరగతి చదువుతున్న శ్రీలేఖ, శ్రీలత, నాగదేవత, లక్ష్మీ, రుషిత, జ్యోతిలక్ష్మి, మౌనిక, సారిక, భూమిక, సింధూ, రాధిక, వైష్ణవిలు వాంతి వస్తున్నట్లు అవుతుందంటూ నిరసించి పోయి అస్వస్థతకు గురయ్యారు. దీంతో వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఆ విద్యార్థినిల తల్లితండ్రులు ఆసుపత్రికి చేరుకున్నారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు వెల్లడించారు. ఈ విషయమై హాస్టల్ వార్డెన్ లక్ష్మీరాజంను వివరణ కోరగా హాస్టల్లో విద్యార్థినిలంతా అదే కిచిడీ తిన్నారని, మేము కూడా తిన్నామని, ఈ 12 మంది మాత్రమే అస్వస్థతకు గురయ్యారని, మిగితా వారెవరికి ఏం కాలేదన్నారు. సంఘటన జరిగిన అనంతరం హాస్టల్లో ఆరోగ్యశాఖ అధికారులు వైద్య శిబిరాన్ని నిర్వహించి మిగితా విద్యార్థినిలకు పరీక్షలు నిర్వహించారు. కిచిడి వల్ల ఏదైనా ఫుడ్ పాయిజన్ జరిగి ఉంటుందా అనే కోణంలో అధికారులు విచారణ చేపడుతున్నారు.

విద్యార్థులు క్షేమంగా ఉన్నారు

నస్పూర్ : మంచిర్యాల పట్టణంలోని సాయి కుంట ప్రాంతంలో గల గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందనికలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలోని 10వ తరగతికి చెందిన 12 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని, వీరిని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించి ప్రత్యేక వైద్య నిపుణుల సమక్షంలో వైద్య సేవలు అందించడం జరుగుతున్నదని, ప్రస్తుతం అందరి విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు.



కుల గణన సర్వేలో నేతకానిగా నమోదు చేయాలని వినతి



నవతెలంగాణ-లక్సెట్టిపేట

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుల గణన సర్వేలో ఎస్సీలో నేతానికి బదులుగా నేతకానిగా నమోదు చేయాలని నేతకాని మహర్ సంక్షేమ సంఘం నాయకులు బుధవారం తహసీల్దార్ దిలీప్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఎస్సీ నేతకాని కులం వారు దాదాపు 12 లక్షలపైగా ఉన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఉంటున్న వాళ్ల వేరువేరు సర్టిఫికెట్లు పొంది ఉన్నారు. కొందరు తప్పుడు ప్రకటనలు చేస్తూ ఎస్సీ మాల నేతకానిగా వర్ణిస్తూ ప్రకటనలు చేస్తున్నారన్నారు. అదేవిధంగా నేతకాని ల సర్టిఫికెట్ సరిచేసి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి పెరుగు తిరుపతి, గవ్వల సురేందర్, జాడీ రమేష్, మొగిలి, రాజన్న, గవ్వల అబ్రహం, పెరుగు మల్లయ్య పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లను పట్టుకున్న పోలీసులు



నవతెలంగాణ-నస్పూర్

సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇంట్లో పేకాట ఆడుతుండగా ఎస్ఐ సుగుణాకర్ ఐదుగురిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2500 నగదు, మూడు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు.

మాల నేతకానీయులుగా వర్ణించడం సరికాదు



నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి మాల నేతకానీయులుగా అభివర్ణించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని నేతకాని మహార్ సంక్షేమ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కామెర శ్రీనివాస్ అన్నారు. భీమారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే మాటలకు నిరసన వ్యక్తం చేశారు. చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ తమ పట్ల చిన్న చూపు చూస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేగా గెలిచే వరకు ఒక మాట గెలిచినాక మరో మాట అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. తెలంగాణలో 20 లక్షల జనాభ కలిగిన నేతకాని కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తానని, రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో నేతకాని భవనం ఏర్పాటు చేస్తామని ఇచ్చిన మాట విస్మరించారన్నారు. తమ అస్థిత్వాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించడం సరి కాదని, ఇప్పటికైనా నేతకానీయుల పట్ల చిన్న చూపు చూడటం మానకపోతే ఎక్కడికక్కడ రాష్ట్ర వ్యాప్తంగా అడ్డుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల నాయకులు అనపర్తి యువరాజ్, కుమ్మరి సంతోష్, డొర్ల మోహన్ పాల్గొన్నారు.

నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడతున్నాం

- ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మండలంలోని నర్వ, ఇందారం గ్రామ పంచాయతీల పరిధిలో చేపట్టనున్న అభివృద్ధి పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు పనిచేస్తోందన్నారు. నియోజకవర్గం పరిధిలో ప్రస్తుతం రూ.60 కోట్లతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత చెన్నూర్, క్యాతన్‌పల్లి, మందమర్రి మున్సిపాలిటీల్లో రూ.100 కోట్లతో తాగు నీటి సరఫరా పనులు కొనసాతున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా జాతీయ రహదారి నెం. 63 విస్తరణ పనులు రూ.100 కోట్లతో చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. రూ.2 కోట్లతో హై ఫ్లెస్ పర్మనెంట్ మరమ్మత్తు పనులు, రూ.125 కోట్లతో చెన్నూర్ మండలం సోమన్‌పల్లిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి గ్రామాల్లో అంతర్గత రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, తాగు నీటి సరఫరాకు ప్రాధాన్యత కల్పి స్తున్నట్లు తెలిపారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-కాసిపేట

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని కాసిపేట ఏఎస్ఐ బూర రవీందర్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, సోమగూడెం భరత్ కాలనీ చౌరస్తాలో సైబర్ మోసాలపై చైతన్య పరిచేందుకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలు, క్రెడిట్ కార్డ్స్ సంబంధిత మోసాలు, ఇన్వెస్ట్మెంట్ మోసాలు, అడ్వర్టైజ్మెంట్ ఫ్రాడ్స్, లోన్ యాప్ లు, ఓటీపీ, సైబర్ క్రైమ్ పోర్టల్, సైబర్ టోల్ ఫ్రీ నెంబర్ 1930పై వివరించారు. సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కి ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు రాజేందర్, రమాదేవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
గురువారం | నవంబర్ 07, 2024 | www.navatelangana.com

రోడ్డు మరమ్మత్తులకు ప్రతిపాదనలు

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండలంలోని ఎల్లూరు నుంచి మేరెగూడ వెళ్లే రోడ్డు మరమ్మత్తులకు ప్రతిపాదనాలను ఉన్నతాధికారులకు పంపిస్తానని మండల ప్రత్యేక అధికారి ప్రభాకర్ రావు అన్నారు. బుధవారం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే తీరును పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం మండలంలోని ఎల్లూరు, బొంబాయి గూడ గ్రామ పంచాయతీలలో సర్వే తీరును పరిశీలించారు. ఎల్లూరు నుండి మేరెగూడ వెళ్లే రోడ్డు మార్గాన్ని పరిశీలించి రోడ్డుకు మరమ్మత్తులు ప్రతిపాదనలు పంపిస్తానని గ్రామస్తులకు చెప్పారు. అదేవిధంగా బొంబాయి గూడా లోని ఎర్రగుంట పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్ సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆల్బర్ట్, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఆదర్శ విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆదర్శ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అండర్-17 చెస్, కబడ్డీ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపిక కాగా ప్రిన్సిపాల్ మహేశ్వర్ వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్య మందమర్రిలో పాఠశాల క్రీడల అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జోనల్ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని, అలాగే బొట్టుపల్లి సాయి దీక్ష కబడ్డీలో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ బి తిరుపతి పాల్గొన్నారు.

కార్యదర్శి తీరును నిరసిస్తూ నిరసన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ గ్రామంలో పనిచేస్తున్న కార్యదర్శి తీరును నిరసిస్తూ మండలంలో మాలన్‌గొంది మాజీ సర్పంచ్ తిరుపతి గ్రామస్తులతో కలిసి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పడుకొని నిరసన తెలిపారు. నిరసనకు సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ తిరుపతి మాట్లాడుతూ గ్రామపంచాయతీ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి తీర్మానాలు ఇవ్వడంలో పంచాయతీ సెక్రెటరీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. పారిశుధ్య నిర్వహణపై పట్టింపు లేకుండా ఉన్నారన్నారు. దీంతో గ్రామంలో పారిశుధ్యం లోపించిందని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ధర్నా విషయం తెలుసుకున్న సదరు పంచాయతీ సెక్రెటరీ ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చి తీర్మాణ ప్రతులను మాజీ సర్పంచ్‌కు అందజేయడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాలల పరిశీలన



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని ఎలుకపెల్లి ప్రాథమిక పాఠశాల, ప్రత్యేక అవసరాల పాఠశాలను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు యాదగిరి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పలు రికార్డులను పరిశీలించిన ఆయన విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ప్రత్యేక అవసరాల పిల్లల పాఠశాలను సందర్శించి విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు సీఆర్‌పీ శ్యామ్ పాల్గొన్నారు.

కులగణన సర్వే సక్రమంగా జరిగేలా చూడాలి

నవతెలంగాణ-బెజ్జూర్

కుల గణన సర్వే సక్రమంగా జరిగేలా చూడాలని, అదే విధంగా సర్వేలో ఆదివాసీ తెగలందరూ పాల్గొనలని ఆదివాసీ కొలవార్ సేవా సంఘం మండల అధ్యక్షులు సంతోష్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాలు అందించారు. కోలవార్ కులంకు చెందిన వారందరి వివరములు ఒకే విధంగా ఉండేటట్లు ఎన్యుమారెటర్లకు తగు సమాచారం ఇచ్చి మా కులగణన సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కొలవార్ ఉన్న తెగ జనాభా కులగణన సర్వేలో తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు మనేపెల్లి మల్లేష్, జిల్లా సహాయక కార్యదర్శి పోల్క వెంకటేష్, నాయకులు బుర్రి భీమేష్, మేకల రాజు, గొర్రిపెల్లి రామయ్య పాల్గొన్నారు.

రోడ్డు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతి



నవతెలంగాణ-ఖానాపూర్

మండలం కుసుంపూర్ గ్రామం నుండి బీర్‌నంది వరకు రోడ్డు మంజూరు చేయాలనీ గ్రామస్తులు, గ్రామ పటేల్ ఆత్రం మోతిరాం బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వేడ్మ బొజ్జుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుసంపూర్ గ్రామంలో ఆదివాసీ 55 కుటుంబాలు నివసిస్తున్నాయిని తెలిపారు. తమ గ్రామ ప్రజలు నిత్యావసర సరుకులు, అత్యావసర వైద్యం, ఎరువుల కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామం నుండి సోమార్‌పేట్ నుండి ఖానాపూర్‌కు రావాలన్నా 9 కిలో మీటర్లు ఉందన్నారు. బల్లి వాగుకు బ్రిడ్జి లేక వర్షాకాలంలో ఐదుగురు వాగు దాటేటప్పుడు ప్రమాదాలు సైతం జరిగాయని తెలిపారు. కుసుంపూర్ నుండి బీర్‌నంది వరకు మూడు కిలోమీటర్లు రోడ్డు మంజూరు చేస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, గ్రామ పెద్దలు ఆత్రం అర్జున్, నైతం తిరుపతి, పుర్క రాము, పుర్క రాజు, ఆత్రం దేవసా, మడవి రఘు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ ఉపాధ్యాయునికి సన్మానం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలం ఆరెగూడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించి గత నెల ఉద్యోగ విరమణ పొందిన దుప్త శంకర్‌కుమార్‌ను బుధవారం ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జెడ్పీఎస్ఎస్ ఆరెగూడ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు పర్వ చంద్రశేఖర్, పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.



పెండింగ్ బిల్లుల మంజూరు ఎప్పుడు..?

- ఎన్నికల బిల్లుల కోసం బాధితుల ఎదురుచూపు
- కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు



నవతెలంగాణ- ఆసిఫాబాద్

గత ఏడాది నవంబర్‌లో జరిగిన శాసనసభ, ఈ ఏడాది మేలో జరిగిన పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి పెండింగ్ బిల్లులు ఇంకా దరిచేరడం లేదు. జిల్లాలో రెండు నియోజకవర్గాల్లో క్యాటరింగ్ ఇచ్చిన వారితో పాటు, వీడియో గ్రాఫర్లు, ఫోటోగ్రాఫర్లకు, అధికారులకు ఇచ్చిన వారికి రూ.లక్షల్లో బిల్లు పెండింగ్ ఉంది. ఎన్నికల సమయంలో బిల్లులకు తామే హామీ అని చెప్పిన అధికారులు ప్రస్తుతం బిల్లులు ఎలక్షన్ కమిషన్ మంజూరు చేయాలని చెప్పడంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పెండింగ్ బిల్లులు మంజూరు కోసం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పెండింగ్ బిల్లుల మంజూరు ఎప్పుడు?

ఎన్నికల కోసం వివిధ రకాలుగా సేవలు అందించిన వారికి రూ.లక్షల్లో బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఇందులో వంట వండిన వారితో పాటు, వీడియోగ్రాఫర్లు, ఫోటోగ్రాఫర్లు, కారు యజమానులు, పెట్రోల్ బంకు యజమానులు, వడ్డీలకు డబ్బులు తీసుకువచ్చి ఎన్నికల్లో అవసరమైన సేవలందించారు. ఇప్పుడు అదే వారి తలపైకి వచ్చింది. బిల్లుల మంజూరు ఎప్పుడు అనేది తెలియక నానా అవస్థలు పడుతున్నారు.

బిల్లుల కోసం బాధితుల ఎదురుచూపులు

ఆసిఫాబాద్ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల సమయం వరకు వంట వండిన వారికి రూ.15 లక్షల వరకు చెల్లించాల్సి ఉండగా సిర్పూర్ నియోజకవర్గం లో కూడా ఇదే మొత్తంలో పెండింగ్ ఉండగా పెట్రోల్ బంక్‌లో రూ.పది లక్షల వరకు కార్లకు రూ.5 లక్షల వరకు పెండింగ్ ఉన్నట్లు తెలిసింది. ఇలా వివిధ రకాలుగా రూ.70 లక్షల వరకు పెండింగ్ ఉండగా బాధితులు బిల్లుల మంజూరు కోసం ఎదురుచూస్తున్నారు.

కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు

ఎన్నికలు పూర్తయి సంవత్సరమైనప్పటికీ బిల్లులు మంజూరు కాకపోవడంతో బాధితులు ప్రతిరోజు కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులు కూడా స్పందించడం లేదని వాపోతున్నారు. ఇప్పటికే తాము ఆర్థిక భారంతో ఇబ్బంది పడుతున్నామని బిల్లుల మంజూరు జాప్యం కావడం మరింత ఆర్థిక కష్టాలు ఎదుర్కొంటున్నామని తెలిపారు.

ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ఉండాలి

- ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు

నవతెలంగాణ-సిర్పూర్(టి)

ఫిర్యాదు దారులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని ఎస్పీ డీవీ.శ్రీనివాస్ అన్నారు. గురువారం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది నిర్వహిస్తున్న విధులు, కేసులకు సంబంధించిన ఫైళ్లను, పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపుర్యకంగా ఉంటూ వారి సమస్యలను ఓపికతో విని వాటిని పరిష్కరించాలన్నారు. ప్రజలకు మంచి సేవలు అందించేందుకు కృషి చేయాలన్నారు. నేర దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రికార్డులు, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. టీజీఎస్పీ పోలీస్ సిబ్బంది విధులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, కౌటల సీఐ రమేష్, ఎస్సై కమలాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను ఎస్పీ డీవీ.శ్రీనివాస్ తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులు, సిబ్బంది నిర్వహిస్తున్న విధుల గురించి ఎస్సైను అడిగి తెలుసుకున్నారు. పోలీసుల విధి విధానాల గురించి సూచించే 5 ఎస్ విధానాన్ని అమలు చేయాలన్నారు. బ్లూకోర్ట్స్, పెట్రోల్ కార్ నిరంతరం గస్తీ నిర్వహించాలని, సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాల పూర్తి సమాచారం సిబ్బంది అందరి దగ్గర ఉండాలని, గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలన్నారు. మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దు వద్ద గల చెక్ పోస్టలలో అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, కౌటల సీఐ రమేష్, సిర్పూర్(టి), చింతనమాలనే ఎస్సైలు కమలాకర్, నరేష్ సిబ్బంది పాల్గొన్నారు.



ఉద్యోగ అవశాకాలు సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ కొలువులే కాకుండా ప్రభుత్వం తరపున ప్రయివేట్ రంగంలో కల్పించే ఉద్యోగ అవశాకాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారిణి మిల్కా అన్నారు. బుధవారం ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో కేఎల్ గ్రూప్ సంస్థలో సూపర్‌వైజర్, హెల్పర్స్ కోసం జాబ్ మేళా నిర్వహించారు. నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై హైదరాబాద్‌లో పని చేసేందుకు ఒప్పుకున్నారు. త్వరలో వారికి హైదరాబాద్‌లోని మెడ్చల్‌లో గల కేఎల్ గ్రూప్ వేర్ హౌజ్‌లో ఇంటర్వ్యులను నిర్వహిస్తామని కంపెనీ ప్రతినిధి అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధి కల్పన అధికారి మిల్కా మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా ఎంపిక చేసిన కంపెనీల్లోనే ఉద్యోగ అవశాలు కల్పించడం జరుగుతుందన్నారు. పని ప్రదేశంలో ఎలాంటి ఇబ్బందులు వచ్చిన తమకు సమాచారం ఇవ్వాలన్నారు. పదవ తరగతి పాస్ అయిన వారికి రూ.17 వేల వేతనంతో ఉద్యోగం కల్పిస్తున్నారన్నారు. జాబ్ ఓ విధంగా పని ప్రదేశంలో మరోలా ఉంటుందని చాలా మంది చెబుతున్నారన్నారు. కానీ ప్రభుత్వం ద్వారా కంపెనీల ఎంపిక చేసి అందులో ఉద్యోగాలు కల్పిస్తున్నామని ఎలాంటి భయం లేకుండా ఉద్యోగాల్లో చేరాలని సూచించారు.

మహిళా సంఘాల అభివృద్ధికి కృషి : డీఆర్డీఓ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహిళా సంఘాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు, స్వయం సమృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్టు డీఆర్డీఓ దత్తారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని డీఆర్డీఓ కార్యాలయంలో ప్రమాద బీమాపై సెర్ప్ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ మహిళా సంఘాల్లో సభ్యురాలుగా ఉండేలా చూడాలన్నారు. సభ్యురాలుగా ఉంటూ ఎవరైనా మరణిస్తే వారికి బ్యాంకు నుండి ఇచ్చిన రుణాలు మాఫీ కావడంతో పాటు ప్రమాద బీమా వర్తిస్తుందని తెలిపారు. రానున్న రోజుల్లో ప్రతి ప్రభుత్వ అభివృద్ధి పని మహిళా సంఘాల ద్వారా జరుగుతుందన్నారు. మహిళలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకు వెళ్లే విధంగా ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందన్నారు. సెర్ప్ సిబ్బంది క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం దిశగా కృషి చేస్తారని వివరించారు. అనంతరం జెడ్ఎమ్ రవికుమార్ బీమా దానికి ఆవశ్యకతపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అందించారు. అనంతరం కాగజ్‌నగర్ మండలంలో సీసీలుగా విధులు నిర్వహించి ఇటీవలే మరణించిన తిరుమల్, అరుణ్ కుమార్‌ల కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.లక్ష 50 వేల చొప్పున రూ.3 లక్షల స్త్రీ నిధి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఏపీడీ రామకృష్ణ ఆర్ఎం శ్రీనివాస్, డీపీఎంలు అన్నాజీ, యశోద, యాదగిరి, సారయ్య, ఏపీఎంలు రాజ్ కుమార్, శ్రీనివాస్ వివిధ మండలాల సీసీలు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-నార్నూర్



మండల కేంద్రానికి చెందిన మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దాదే అల్లి తండ్రి రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ జడ్పీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్ బుధవారం బాధిత కుటుంబానికి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్, జేఏసీ మాజీ చైర్మన్ ఉత్తం రాథోడ్, ఫ్యాక్స్ ఇన్‌చార్జి చైర్మన్ సురేష్ ఆడే, ఫ్యాక్స్ డైరెక్టర్ కాంతారావ్ దుర్గే, సయ్యద్ ఖాసిం, చంద్రశేఖర్ లోఖండే, అల్తాఫ్ ఖాన్, అయ్యుబ్, ఫెరోజ్ ఖాన్ పాషా ఖాన్ ఉన్నారు.

గొల్లబాయ్ చెరువులో చేప పిల్లలు విడుదల

నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలో చిన్న సిద్దాపూర్ శివారులోని గొల్లబాయ్ చెరువులో చేప పిల్లలను మత్స్యశాఖ అధికారులు బుధవారం వదిలారు. ప్రభుత్వం మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేస్తున్నట్లు మత్స్యశాఖ ఫీల్డ్ ఆఫీసరు మధుకర్ తెలిపారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్షులు సూర్ల ఇస్తారీ, పంచాయతీ కార్యదర్శి తుకారం, మత్స్యకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

10న రాష్ట్ర కమిటీ సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-ఉట్నూర్

ఈనెల 10న ఉట్నూర్ మండల కేంద్రంలోని కుమురం భీం ప్రాంగణంలో నిర్వహించే ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కమిటీ సర్వసభ్య సమావేశానికి సభ్యులు అందరూ హాజరై విజయవంతం చేయాలని రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి సెడ్మాకి రామారావు కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ అనుబంధ సంఘాలు ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్, ఏవీఎస్‌పీ, ఏయూఎస్ఎస్, సంఘాల రాష్ట్ర జిల్లాల స్థాయి నాయకులు, మండల నాయకులు ప్రతి ఒక్కరు సమావేశానికి హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అరక ఉమేష్, నాయకులు మరప శంభు, సెడ్మాకి వినోద్, తినక ప్రభాకర్ పాల్గొన్నారు.



విద్యార్థుల చదువుపై శ్రద్ధ పెట్టాలి



నవతెలంగాణ-కౌటాల

ఉపాధ్యాయులు విద్యార్థుల చదువుపై శ్రద్ధ పెట్టాలని ఎంఈఓ గావుడె హనుమంతు అన్నారు. బుధవారం మండలంలోని తలోడి ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించి పాఠశాలకు హాజరుకాని విద్యార్థులపై ఎలాంటి చర్యలు చేపడుతున్నారని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం పిల్లలతో కలిసి భోజనం చేసి ప్రతిరోజు ఈ విధంగానే భోజనం పెడుతున్నారని పిల్లలను అడిగి తెలుసుకున్నారు. ఈరోజు ఒక్కరోజు మాత్రమే ఇలా పెట్టినట్లయితే తమకు మీ తల్లిదండ్రుల ద్వారా సమాచారం అందించాలని పిల్లలకు సూచించారు. మధ్యాహ్న భోజన నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన కార్మికులకు హెచ్చరించారు. ఆయన వెంట సీఆర్పీ గంధం ప్రకాష్ ఉన్నారు.

10 నుండి వికలాంగుల రిలే దీక్షలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

వికలాంగులకు పెన్షన్లు పెంచుతామని హామీ ఇచ్చి విస్మరించినందుకు నిరసనగా ఈ నెల 10 నుండి ఆరు రోజుల పాటు రిలే దీక్షలు చేపట్టనున్నట్లు వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా ఇన్‌ఛార్జి పెద్దపల్లి సత్యనారాయణ తెలిపారు. బుధవారం కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వికలాంగుల పెన్షన్‌లను రూ. 6 వేలకు పెంచుతామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. దీనిని నిరసిస్తూ దశల వారీ పోరాటాలలో భాగంగా ఆరు రోజుల పాటు అన్ని జిల్లా కలెక్టరేట్‌ల ముందు రిలే దీక్షలు చేపట్టి, అనంతరం 26న ఛలో హైద్రాబాద్ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు ఎండి ఖయ్యూం, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి జలంపల్లి శ్రీనివాస్, నాయకులు మంత్రి మల్లేష్, పొన్నాల రమాకాంత్ తదతరులు పాల్గొన్నారు.

విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని మలంగి గ్రామంలో గుట్టపై బంజారాల ఆరాధ్య దైవం జగదంబ దేవి, సేవాలాల్, తపస్వి రామారావ్ మహారాజ్ విగ్రహాన్ని దివ్యశ్రీ ఫౌండేషన్ చైర్మన్ ధారావత్ ప్రవీణ్ నాయక్ ఏర్పాటు చేయడం అభినందనీయమని దీక్ష గురు ప్రేమ్ సింగ్ మహారాజ్ అన్నారు. బుధవారం నిర్మాణ పనులను పరిశీలించారు. సమాజం కోసం చేస్తున్న మంచి పనులు ఎప్పటికీ గుర్తుండి పోతాయని కొనియాడారు. ఆయన వెంట గ్రామ పెద్దలు, దివ్యశ్రీ ఫౌండేషన్ సభ్యులున్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక



నవతెలంగాణ-కౌటాల

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు కౌటాల విద్యార్థి ఎంపిక కావడంతో మండల వాసులు అభినందించారు. మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి బన్నీత్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నారాయణ్ సింగ్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ పట్టణంలోని రెసొనెన్స్ వరల్డ్ పాఠశాలలో జరిగిన జోనల్ లెవెల్ అండర్-17 కబడ్డీ పోటీల్లో అద్భుత ఆటతీరును ప్రదర్శించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని, నవంబర్ 7 నుండి 9 వరకు యాదాద్రి భువనగిరిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాడన్నారు. విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు రాంచందర్, శ్యామ్ రావు, రమేష్, రయిస్ అహ్మద్, కవిత, సత్యనారాయణ, సంధ్యారాణి, నరసింహచారి, విఠల్, యేసుమణి, సింధు, విజయ్ సింగ్ అభినందించారు.

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-వాంకిడి

ప్రస్తుతం కంప్యూటర్ యుగంలో పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగా సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఏఎస్సై పోశెట్టి అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని శివాజీ చౌరస్తా వద్ద మండల ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ ద్వారా లావాదేవీలు నడిపేవారు కొత్త వ్యక్తుల మాటలను నమ్మరాదని, తెలియని మెసేజ్‌లపై క్లిక్ చేయరాదని తెలిపారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
గురువారం | నవంబర్ 07, 2024 | www.navatelangana.com

పూర్వ విద్యార్థిని సన్మానించిన ఉపాధ్యాయులు

నవతెలంగాణ-జైపూర్



మండల కేంద్రానికి చెందిన పూర్వ విద్యార్థి రామగిరి సిద్దును పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. పెగడపల్లి గ్రామానికి చెందిన రామగిరి సిద్దు మండల కేంద్రంలో గల జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో చదివి ప్రస్తుతం బార్డర్ సెక్యూరిటీ ఉద్యోగిగా దేశ రక్షణలో పాల్గొంటున్నాడు. పూర్వ విద్యార్థి ఇటీవల స్వగ్రామానికి వచ్చినట్లు తెల్సుకున్న ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో పాఠశాల రిటైర్డ్ ప్రధానోపాధ్యాయురాలు అలీస్ మాధూర్యతో కలిసి సన్మానించారు. విద్యార్థులు విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న తదుపరి తమకు నచ్చిన రంగాల్లో స్థిరపడి మంచి పేరు ప్రఖ్యాతులు గడించాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

వార్డుల్లో ఎమ్మెల్యే వివేక్ మార్నింగ్ వాక్

నవతెలంగాణ-మందమర్రి



ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి మార్నింగ్ వాక్‌లో భాగంగా బుధవారం 6,7,10వ వార్డులు నార్లపూర్, ఊరు రామకృష్ణాపూర్, 3వ జోన్, దొరల బంగ్లా ప్రాంతాల్లో పర్యటించారు. కాలనీలలో పర్యటిస్తూ స్థానికలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలంటూ మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఎన్నో ఏండ్లుగా అసంపూర్తిగా ఉన్న లెదర్ పార్కును పరిశీలించారు. ఈ సందర్భంగా లెదర్ పార్క్ మీదుగా సోలార్ ప్లాంట్‌కు వెళ్లేందుకు తీసిన దారిని పరిశీలించారు. లెదర్ పార్క్ భూములు ఆక్రమించుకుంటున్నారని సింగరేణిపై దళిత సంఘాల నాయకులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. వెంటనే సింగరేణి అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని స్థానికులకి భరోసా కల్పించారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

- పీఏసీఎస్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్



నవతెలంగాణ-హాజీపూర్

ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని మంచిర్యాల పీఏసీఎస్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుధవారం నమ్నూరు గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళార్లకు ధాన్యం అమ్ముకోవద్దని సూచించారు. నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి ప్రభుత్వ మద్దదు ధర పొందాలని సూచించారు. ఏ గ్రేడ్ రకానికి రూ.2320, బీ గ్రేడ్ రకానికి 2300, సన్నారకానికి రూ.2500 మద్దతు ధర ఇస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బాలరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నారిశెట్టి సంతోష్, ఆడేపు రమేష్, గోపు గంగయ్య, లింగయ్య, ముత్యాల శంకర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు గ్రామ కమిటీలు

- మంచిర్యాల డీసీపీ భాస్కర్

నవతెలంగాణ-తాండూర్




రోడ్డు ప్రమాదాల నివారణకు రహదారి సమీప గ్రామాలలో కమిటీలను ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు డీసీపీ భాస్కర్ తెలిపారు. బుధవారం వార్షిక తనిఖీల్లో భాగంగా తాండూరు సర్కిల్ పరిధిలోని మాదారం పోలీస్‌స్టేషన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాండూరు సర్కిల్ పరిధిలోని భీమిని, కన్నెపల్లి, నెన్నెల, మాదారం పోలింగ్‌స్టేషన్ల పరిధిలో ఇప్పటికే కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. కమిటీల ద్వారా రహదారి భద్రత గురించి వాహనాదారులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు నివారించేందుకు ప్రధాన కూడళ్ల వద్ద వెహికల్ చెకింగ్ చేయడం జరుగుతుందన్నారు. నిబంధనలను అతిక్రమించిన వాహనాదారులకు జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. కళాశాల, పాఠశాలల్లో ప్రహరి క్లబ్లను ఏర్పాటు చేసి ఉపాధ్యాయ విద్యార్థులకు గంజాయి వాడకం వల్ల జరిగే అనర్థాల గురించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. అదేవిధంగా నెలలో ప్రతి మూడవ గురువారం విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల గంజాయి మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లా నార్కోటిక్ కోఆర్డినేషన్ కమిటీ అభిప్రాయాల మేరకు గంజాయి మాదకద్రవ్యాల నియంత్రణకు పగడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. నార్కోటిక్ డాగ్ ద్వారా గంజాయి వినియోగించే వారిని గుర్తించి మంచిర్యాల డి హైడ్రేషన్ సెంటర్‌లో కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో తగాదాలు నేరాల నియంత్రణకు పల్లెనిద్ర, కార్డెన్ సెర్చ్‌లు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా పక్క రాష్ట్రం మహారాష్ట్ర నుంచి గంజాయి అమ్మకం రవాణా దారులను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారి ఫిర్యాదులను చట్ట పరిధిలో సామరస్యంగా పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ రవికుమార్, సీఐ కుమారస్వామి, మాదారం ఎస్ఐ సౌజన్య పాల్గొన్నారు.

సేవాలాల్ సేన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని లంబాడీతాండ(కే) గ్రామ సేవాలాల్ సేన గ్రామ కమిటీని మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గుగ్లోత్ మల్లేష్ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజిమెరా తిరుపతి నాయక్, రాష్ట్ర ఉపాధక్షులు జాదవ్ గజనంద్ నాయక్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సేవాలాల్ సేన లంబాడితాండ(కే) గ్రామ కమిటీ అధ్యక్షులుగా బదావత్ రాజు నాయక్, ప్రధాన కార్యదర్శిగా భూక్యా శ్రీనివాస్ నాయక్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బోడ భీమా నాయక్, ఉపాధ్యక్షులుగా అజ్మీర రమేష్ నాయక్, బాధావత్ నాగేష్ నాయక్, గౌరవాధ్యక్షులుగా భూక్యా హరిచంద్ నాయక్, భూక్యా రమేష్ నాయక్, లక్ష్మణ్ నాయక్, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గణిరాం నాయక్, జైపాల్ నాయక్ పాల్గొన్నారు.

మెరుగైన క్యాడర్ స్కీం, ప్రమోషన్ పాలసీకి కృషి చేస్తాం



నవతెలంగాణ-నస్పూర్

మెరుగైన క్యాడర్ స్కీమ్, ప్రమోషన్ పాలసీకి కృషి చేస్తామని ఐఎన్టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు అన్నారు. బుధవారం ఎస్ అండ్ పీసీ సమస్యలపై ఫిట్ సెక్రటరీ పూదరి సాంబయ్య ఆధ్వర్యంలో డిపార్ట్మెంట్ అడిషనల్ మేనేజర్ జక్కారెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్అండ్ పీసీ సిబ్బందికి స్థానికంగా క్వార్టర్ల కేటాయింపు, ప్లేడేల వర్తింపు ఔట్ పోస్టులలో మౌలిక సౌకర్యాల కల్పన, ఎన్నికల సందర్భంగా విధుల నిర్వహనలో ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు అచలాపూర్ విద్యార్థి



నవతెలంగాణ-తాండూర్

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు అచలాపూర్ విద్యార్థి ఎంపికైనట్లు పీడీ ఏ సాంబమూర్తి తెలిపారు. ఈ నెల 5న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రేసోనెన్స్ వరల్డ్ స్కూల్‌లో జోనల్ స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14 బాయ్స్ టోర్నమెంట్‌లో తాండూరు మండలం అచులపూర్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఏ రాజ్ కుమార్ మంచిర్యాల జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహించి అంత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక ఆయ్యారని తెలిపారు. ఈ నెల 7 నుంచి 9 వరకు యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని మాదాపూర్‌లో నిర్వహించే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నాట్టు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి ఉమాదేవి, ఉపాధ్యాయులు రాజేశ్వర్ రావు, శ్రీనివాస్, సుధాకర్, శ్రీనివాస్‌గౌడ్, హరిప్రసాద్, భాస్కర్, రవి, శ్రీనివాస్, అంజిరెడ్డి, శ్రీనివాస్, జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ ఫణి రాజా, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ చిలుకమ్మ, అచులాపూర్ గ్రామ పెద్దలు అభినందించారు.

నిర్ణీత గడువులోగా సర్వే పూర్తి చేయాలి

- ఇందారం గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-జైపూర్

మండల పరిధిలో చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేవించారు. బుధవారం ఇందారం గ్రామ పంచాయతీని అకస్మికంగా సందర్శించారు. కుటుంబ సర్వేలో భాగంగా ఇంటింటికి స్టిక్కరింగ్ పూర్తి చేసినందున మండల షెడ్యూల్ ప్రకారం సర్వే సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. స్థానిక ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలను సంధర్శించిన కలెక్టర్ విద్యార్థుల హాజరు శాతం, మధ్యాహ్న భోజన వసతిని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సంధర్శించి పౌష్టికాహారం, పిల్లల హాజరు తదితర విషయాలపై ఆరా తీశారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సంధర్శించి రికార్డులు తనిఖీ చేశారు. అధికారుల హాజరు పని తీరు అడిగి తెల్సుకున్నారు. నర్సరీ సంధర్శించి నిర్వాహణ కార్యాక్రమాలు అడిగి తెల్సుకున్నారు. బ్యాగ్ ఫిల్లింగ్ పూర్తి చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శికి సూచించారు. శ్మశాన వాటిక, సెగ్రిగేషన్ షెడ్ తనిఖీ చేశారు. తడిపొడి చెత్త నిర్వాహణ రికార్డుల నిర్వాహణ తదితర విషయాలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణగౌడ్, ఎంపీఓ శ్రీపతి బాపురావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి సుమన్ పాల్గొన్నారు.

మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని భరోసా టీం ఇన్‌ఛార్జి, మహిళా ఎస్ఐ తిరుమల అన్నారు. బుధవారం పట్టణంలోని కేరళ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తిరుమల మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో బాలికలు సెల్‌ఫోన్ వినియోగం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఫోక్సో చట్టం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో షి టీం సభ్యురాలు రమాదేవి, సునీతతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-దహెగాం

ఏడీసీసీ బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ రుషిదేవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు పెసరకుంట గ్రామాల్లో బ్యాంక్ పథకాలపై అవగాహన కల్పించారు. పీఎంఎస్‌వై, పీఎంజేజేవైతో పాటు ధనవర్ష తదితర వాటిపై వివరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సెక్రటరీ నారాయణ, ఎఫ్ఎల్సీ అంజన్న, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్, రైతులు పాల్గొన్నారు.

సింగరేణి లెవెల్ ఫుట్‌బాల్ విజేత శ్రీరాంపూర్ ఏరియా జట్టు



నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి లెవెల్ ఫుట్ బాల్ టోర్నమెంట్ విజేతగా శ్రీరాంపూర్ ఏరియా జట్టు నిలిచింది. సింగరేణి హై స్కూల్ మైదానంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న పోటీల్లో బుధవారం శ్రీరాంపూర్ వర్సెస్ జీడీకే 1,2 ఏరియా జట్లకు మధ్య తుది పోరు జరిగింది. నువ్వా నేనా అన్నట్లు సాగిన తుది పోరులో శ్రీరాంపూర్ ఏరియా జట్టు టోర్నమెంట్ విజేతగా నిలిచింది. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులందరికీ అభినందనలు తెలిపారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని ఓడినా గెలిచినా స్పోర్టివ్‌తో తీసుకోవాలని అన్నారు. అనంతరం విన్నర్స్ శ్రీరాంపూర్ ఏరియా, రన్నర్స్ జీడీకే-1 అండ్ 2 ఏరియా క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. గెలుపొందిన శ్రీరాంపూర్ ఏరియా క్రీడాకారులను అభినందిస్తూ కోల్ ఇండియా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి సింగరేణికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కంపెనీ స్థాయి ఫుట్బాల్ టోర్నమెంట్ పోటీలను రెండు రోజులు అన్నీ ఏర్పాట్లు చేసినటువంటి ఏరియా గౌరవ కార్యదర్శి, కోఆర్డినేటర్, ఆర్గనైజర్స్, సూపర్‌వైజర్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ అక్బర్ అలీ, దాగం మల్లేష్, సీఎంఓఏఐ అధ్యక్షులు రమేష్, డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ గౌరవ కార్యదర్శి కార్తీక్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ కార్పొరేట్ పాస్నేట్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్లు జాన్ వెస్లీ, అశోక్, రమేష్, శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శివ కృష్ణ, జనరల్ క్యాప్టన్ సాక శ్రీనివాస్ పాల్గొన్నారు.



కులగణనకు అన్ని వర్గాలు సహకరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ప్రభుత్వం బుధవారం నుండి ఈ నెల 30 వరకు నిర్వహించే కులగణనకు సమాజంలోని అన్ని వర్గాలు సహకరించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బీసీ సంఘ సభ్యులు తమ గ్రామాలలో కులగణనకు వచ్చే ప్రభుత్వ సిబ్బందికి అన్ని విధాల సహకరించి, వివరాలు సక్రమంగా నమోదు చేసే విధంగా పాలుపంచుకోవాలన్నారు. తెలంగాణలో జరిగే సామాజిక సర్వేతో వెనుకబడిన తరగతి కుటుంబాల్లో వెలుగులు సాధ్యమవుతాయన్నారు. ఉన్నతమైన ఈ ఆశయాన్ని కొన్ని దుష్టశక్తులు అడ్డుపడితే తగిన గుణపాఠం దక్కడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా రైతు అధ్యక్షుడు వైరాగడే మారుతి పటేల్, మాలీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగోశే శంకర్, విశ్వనాథ్, ఆనందరావు, నారాయణ పాల్గొన్నారు.

ఐక్యంగా ముందుకు సాగాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పద్మశాలీలు ఐక్యంగా ముందుకు సాగుతూ అన్ని రంగాల్లో ఎదగాలని సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్లా ఆంజనేయులు అన్నారు. బుధవారం పట్టణ పద్మశాలి సంఘం ప్రమాణ స్వీకారాన్ని గుండిరోడ్‌లో గల పద్మశాలి భవనంలో నిర్వహించారు. అధ్యక్ష కార్యదర్శులతో పాటు పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో అత్యధిక జనాభా ఉన్న పద్మశాలీలు రాజకీయ ఆర్థిక వ్యాపార సామాజిక రంగాల్లో రాణించాలన్నారు. ఐక్యంగా ఉంటే ఏదైనా సాధించుకోవచ్చని తెలిపారు. పద్మశాలీల సమస్యల పరిష్కారానికి అందరితో కలిసి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అనుమండ్ల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి ఆల్లె శ్రీకాంత్, గౌరవ అధ్యక్షుడు కోమటిపల్లి లింగయ్య, కోశాధికారి సంజీవ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు సామల రాజయ్య, రాష్ట్ర నాయకులు కనకయ్య, శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గడదాస్ మల్లయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ మారేని వెంకటేష్, కాగజ్‌నగర్ పట్టణ అధ్యక్షుడు రాజమౌళి, నాయకులు ధర్మయ్య, మోహన్, రమేష్, నారాయణ, ప్రకాష్, మధుకర్, రవీందర్, పద్మశాలి సేవా సంఘం కార్యవర్గ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



సింగరేణి సేవా సమితి ద్వారా ఫ్యాషన్ డిజన్‌లో ఉచిత శిక్షణ

- డీజీఎం పర్సనల్ అజ్మీరా తుకారాం

నవతెలంగాణ-జైపూర్



సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఇక నుండి ఫ్యాషన్ డిజన్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ప్లాంట్ డీజీఎం పర్సనల్ తుకారాం అన్నారు. ఎస్టీపీపీ సింగరేని సేవా భవన్‌లో బుధవారం ఉచిత ప్యాషన్ డిజన్ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ నిర్వాసిత గ్రామాల మహిళల సాధికారత, స్వయం సమృద్ధి కోసం సంస్థ అనేక రకాలైన ఉచిత శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న ఉచిత శిక్షణ తరగతులను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం ప్రారంభిచుకున్న ఫ్యాషన్ డిజైన్ంగ్ ద్వార మహిళలు వారి అభిరుచులకు తగ్గట్టుగా, సృజనాత్మకతతో కొత్త డిజైన్లు ఆవిష్కరించే అవకాశం ఉన్నట్లు తెలిపారు. అనంతరం గతంలో సింగరేణి సేవా సమితి ద్వార టైలరింగ్ శిక్షణ పొంది ఉత్తీర్ణులైన మహిళలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఠాకూర్ మోహన్ సింగ్, సింగరేణి సేవా సమితి కో ఆర్డినేటర్ చిలుక అరుణ, టైలరింగ్ శిక్షకురాలు రఫియా, ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షకురాలు రచన పాల్గొన్నారు.

ఎంజేపీని సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జీ

నవతెలంగాణ-నిర్మల్ రూరల్



జిల్లా కేంద్రంలోని ఎంజేపీ పాఠశాలను సీనియర్ సివిల్ జడ్జీ, డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాధిక బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థి మృతి చెందడంతో హాస్టల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని రికార్డులు, పరిసరాలు, మరుగుదొడ్లను పరిశీలించి నిర్వహణ వ్యవస్థ చూసి అసహనం వ్యక్తం చేశారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ బుద్దే రవీందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కర్ణగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సైబర్ నేరాలపై అవగాహన సదస్సుకు ఎస్సై రాజేశ్వర్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు ఎవరిని కూడా వదలడం లేదని వాటిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. లోన్ యాప్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని, అపరిచిత నెంబర్ల నుండి ఫోన్లు వస్తే ఎటువంటి సమాచారం అందించకూడదన్నారు. సైబర్ నేరానికి గురైనట్లు గుర్తిస్తే వెంటనే 1930కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో విశ్రాంత సంఘం నాయకులు బాల శ్రీరాములు, రమేష్, గజ్జెల పోచన్న, నాంపల్లి శంకర్, సిడం సూరు, శ్యామ్ రావ్ దుర్గే, గౌరక్క, పిల్లి సత్యమ్మ, పద్మ, వరలక్ష్మి, కుమారస్వామి, మహమూద్, నర్సయ్య పాల్గొన్నారు.